



# మార్పు

తోలేటి జగన్మోహనరావు

*నర్రెంక చెట్టు క్రింద - నరుడో భాస్కరుడో*
*కన్నెర్ర సేస్తివయ్య - నరుడో భాస్కరుడో*
*కన్నెర్ర సేసి నీవు - నరుడో భాస్కరుడో*
*కదనమే అన్నావ - నరుడో భాస్కరుడో*

అర్ధరాత్రి నిశ్శబ్దంలో మాధవరావు గొంతు ఆ గదిలో ప్రతిధ్వనిస్తూ ఆ నలుగురు యువకుల్ని ఉద్రేకంతో ఊగేలా చేస్తోంది.

కవిత్వం, సంగీతం అందరినీ ఒకేలా ప్రభావితం చెయ్యకపోవచ్చు. చాలామంది మీద చెప్పుకోదగిన ప్రభావం ఏమీ లేకపోవచ్చు. కానీ, చాప మీద కూర్చుని గోడకి చేర్లబడి కళ్లు మూసుకు వింటున్న విశ్వం గుండెల్లో ఆ పాట ఏదో అల్లకల్లోలం సృష్టిస్తోంది.

*గొట్టంకి చెట్టు క్రింద - నరుడో భాస్కరుడో*
*గొడ్డలి పడితివయ్యా - నరుడో భాస్కరుడో*
*గొడ్డాలి పట్టి నీవు - నరుడో భాస్కరుడో*
*గుడ్డెలుగు కొడితివయ్యా - నరుడో భాస్కరుడో*

విశ్వం స్వరం వినడంలేదు. కవిత్వం ఆస్వాదించడం లేదు. ఆ రెంటికీ అతీతమైన విధంగా, ఒక గుండెలోంచి వెలువడుతున్న ఆవేదనతో కూడిన ఆవేశం అతని హృదయాన్ని సూటిగా తాకుతోంది. నిప్పులు పూసిన మోదుగలూ, పడి లేచే కల్లోల తరంగాలూ, సంకెళ్లు త్రెంచుకుంటున్న చేతులూ, చీకటితో పెనుగులాడుతున్న చిరుదీపాలూ, ఉప్పెన లాంటి విప్లవాలూ అతని కళ్ల ముందు కదలాడుతున్నాయి. అతని శరీరమంతా ఆవేశంతో వణుకుతూ ఉంది.

ఆ స్థితిలో అలా ఎంతసేపు ఉన్నాడో తెలియదు కానీ, మోటారుసైకిలు ఆగిన చప్పుడు వినిపించి అతనికి తెలివొచ్చింది. క్షణం తర్వాత తలుపు మీద మూడుసార్లు మెల్లిగా ఎవరో తట్టారు.

"ఎవరు?" అన్నాడు మాధవరావు లేస్తూ.

"నేను," సమాధానం వచ్చింది మెల్లిగా.

మాధవరావు తలుపు తియ్యగానే ఇద్దరు వ్యక్తులు- ఒక యువకుడు, ఒక మధ్య వయస్కుడు లోపలికి వచ్చారు. ఆ యువకుడి పేరు విశ్వానికి తెలియదుగాని, మాధరావుతో పాటు అతన్ని అంతకు ముందు ఒకటి రెండుసార్లు చూశాడు. మధ్య వయస్కుణ్ని మాత్రం అతను ఎప్పుడూ చూడలేదు.

వాళ్లిద్దరూ గదిలో వున్న యువకులకి షేక్‌హ్యాండిచ్చారు. మధ్యవయస్కుడితో చెయ్యి కలిపినప్పుడు అతని చెయ్యి చెక్కలాగా మొరటుగా తగిలి అతని బలానికి ఆశ్చర్యపోయాడు విశ్వం.

అంతా కూర్చున్నాక ఏ ఉపోద్ఘాతం లేకుండా మధ్య వయస్కుణ్ని చూపిస్తూ అన్నాడు మాధవరావు, "తెలంగాణ పోరాటం గురించి మాట్లాడతాడు బాబయ్య!"

బాబయ్య...

ఆ మాట వినిపించగానే గదిలో వాతావరణం పూర్తిగా మారిపోయింది. ఒక్కసారి చలనం వచ్చినట్టయింది. నలుగురు యువకులూ ఉలిక్కిపడి లేచి బాబయ్యకేసి మెరిసే కళ్లతో చూశారు.

బాబయ్య...

అతని పేరు ఆరు జిల్లాలలో అడివి ప్రాంతాలలో మారుమ్రోగుతోంది. ఆరు జిల్లాల్లో అతని సాయుధ దళాలు పోరాడుతున్నాయి. అతని తల మీద లక్ష రూపాయల పారితోషికం ఉంది. అతని పేరు వినడమే

కానీ అతన్ని అంతకుముందు ఎన్నడూ చూడలేదు విశ్వం. అసలు మాధవరావుకు బాబయ్యతో పరిచయం ఉన్నదన్న విషయం కూడా అంతవరకూ విశ్వానికి తెలియదు.

బాబయ్యతో వచ్చిన యువకుడు, బాబయ్య కూర్చున్న తర్వాత బయటకు వెళ్లి తలుపేశాడు. అతను వెళ్లిన తర్వాత బాబయ్య ఒక నిమిషం నలుగురు యువకుల్నీ పరిశీలనగా చూశాడు. తర్వాత మెల్లిగా మాట్లాడటం మొదలుపెట్టాడు. క్రమక్రమంగా అతను స్వరం పెంచకుండానే ఆవేశంగా మాట్లాడసాగాడు.

నైజాం పాలన, దేశముఖుల క్రూరత్వం, వెట్టి చాకిరి, తెలంగాణ రైతాంగం ఎలా హింసించబడిందీ, వాళ్లు క్రమంగా ఆంధ్ర మహాసభ నాయకత్వం క్రింద సంఘటితమై రజాకారు మూకల్నీ, నైజాం సైన్యాల్నీ ఎలా తరిమికొట్టిందీ- అతను వివరంగా చెప్పాడు. నైజాం ఇండియన్ యూనియన్లో విలీనం కావడం, యూనియన్ సైన్యాలు తెలంగాణలో ప్రవేశించి ప్రజా ఉద్యమాన్ని నెత్తుటేరుల్లో ముంచెయ్యడం, వాటికి వ్యతిరేకంగా రెండు సంవత్సరాల గెరిల్లా పోరాటం గురించి మాట్లాడాడు. దోపిడీ వర్గం మారింది కానీ నిజమైన స్వాతంత్ర్యం రాలేదన్నాడు. వామపక్ష పార్టీలు ఓట్లు, సీట్ల కోసం ఉద్యమానికి ద్రోహం చేస్తూ బూర్జువా వర్గాల తోకగా తయారయ్యాయనీ, నిజమైన విముక్తికి సాయుధ పోరాటం తప్ప గత్యంతరం లేదనీ, అందుకు యువతరం కదలి రావాలని చెప్పాడు.

బాబయ్య అవిరామంగా ఒక గంట మాట్లాడి ఆగాడు. తన మాటలు ఆ నలుగురి మీదా ఏ ప్రభావం కలిగించాయో అని అంచనా వేస్తున్నట్టు నలుగురికేసి సూటిగా చూశాడు. ఇంతలో బయట కాపలా ఉన్న యువకుడు లోపలికి వచ్చి బాబయ్యకేసి చూసి తల ఊపాడు. బాబయ్య లేచి నలుగురికి నమస్కారం చేసి వెళ్లిపోయాడు.

బాబయ్య ఉపన్యాసం విన్న విశ్వానికి ఏదో చెయ్యాలన్న తపన కలిగింది. అతని యువరక్తం ఉత్సాహంతో ఉరకలు వేసింది.

"ఏం చేద్దాం, కామ్రేడ్స్?" మాధవరావు అడిగాడు.

"నువ్వే చెప్పు!" అన్నారు అందరూ ఏక కంఠంతో.

ఈ వ్యవస్థను సాయుధ పోరాటం ద్వారా కూల ద్రోయాలనే విషయంలో వాళ్లకి సందేహాలు ఏమీలేవు. ఆ ఆశయ సాధనకు ఏదో ఒకటి చెయ్యడానికి వాళ్లు నలుగురూ సిద్ధంగా ఉన్నారు.

"మనం అయిదుగురం సాంస్కృతిక కార్య క్రమాల ద్వారా ప్రజల్ని చైతన్యవంతుల్ని చెయ్యాలి. దీనిలో బలవంతం ఏమీలేదు. రావాలనుకున్నవాళ్లు రావచ్చు- వద్దనుకున్న వాళ్లు మానెయ్యొచ్చు," అన్నాడు మాధవరావు.

మారు ఆలోచన లేకుండా నలుగురూ వెంటనే సిద్ధం అయిపోయారు. వాళ్లు సాంస్కృతికదళంగా ఏర్పడి ఆటలు ఆడుతూ, పాటలు పాడుతూ అడవుల్లో, కొండల్లో, మారుమూల ప్రాంతాల్లో తిరగడం మొదలు పెట్టారు.

ప్రజలు వారిని ఉత్సాహంగా ఆహ్వానించేవారు. విశ్వం లంచగొండి ఉద్యోగుల్ని, పోలీసుల్నీ, ఎమ్మెల్యే లని అనుకరిస్తుంటే జనం విరగబడి నవ్వేవారు. మాధవ రావు 'చెల్లీ చెంద్రమ్మ' పాడుతుంటే తమ బ్రతుకుల్లోని అమావాస్యలూ, నిత్య శివరాత్రులూ గుర్తుకొచ్చి కంట తడి పెట్టేవారు. అతను చేతికర్ర తుపాకీలా ఎక్కుపెట్టి ఊపుతూ, 'చావు మీదిరో-బతుకు మాదిరో' అని పాడు తుంటే జనం ఉత్సాహంగా చప్పట్లు కొట్టేవారు. ఆఖరున మాధవరావు పరిస్థితులు వివరించి సాయుధ పోరాటం తప్ప గత్యంతరం లేదని చెప్పేవాడు.

మాధవరావు కాలేజీ వదిలి అతివాద ఉద్యమం లోతుల్లోకి దిగిపోతుంటే మరో ఆలోచన లేకుండా అతన్ని అనుసరించాడు విశ్వం. విశ్వానికి మాధవరావుని చూస్తే చాలా ఆశ్చర్యంగా ఉండేది. తనతో చిన్నప్ప ట్నుంచీ కలిసి మెలిసి తిరిగినది ఈ మధుయేనా అని అతనికి అనిపించేది. అతని దృష్టిలో మాధవరావు క్రమ క్రమంగా చాలా ఎత్తుకు ఎదిగిపోయాడు. ఒక మహత్త రమైన మార్పుకి ఒక నిజాయితీపరుడిని అనుసరించడం అతనికి గొప్ప విషయంగా కనిపించింది. ఇది ఏ పరిణా మానికి దారి తీస్తుంది అని అతను చాలా కాలం వరకు ఆలోచించలేదు.

మాధవరావు వెంట ఓ సంచి భుజానికి తగిలించు కుని, తిండీ తిప్పలూ లేకుండా అడవుల్లో పడి తిరుగు తున్న రోజులలో ఆ ఆలోచన కలిగించే సంఘటన ఒకటి అనుకోకుండా తటస్థపడింది.

ఆ రోజు ఇంక తెల్లవారుతుందనగా మాధవరావు దళం ఓ గ్రామాన్ని సమీపిస్తుండగా, గ్రామం ముందే ఒక సానుభూతిపరుడు అడ్డుపడి హెచ్చరించాడు. రాత్రి మరో గ్రూపువాళ్లు భూస్వామిని హత్య చేశారనీ, పోలీసులు ఏ క్షణంలోనైనా దిగొచ్చునని చెప్పి, వెంటనే అక్కడ నుంచి పారిపొమ్మని సలహా ఇచ్చాడు.

అతను అలా చెబుతుండగానే దూరంగా రోడ్డు మీద దుమ్ము మేఘం లేచింది.

అతని మాటలు విన్న విశ్వానికి ఆవేశంతో హృదయం ఉప్పొంగలేదు. భయం కలిగింది. వింతగా ఒళ్లంతా నిస్సత్తువ ఆవరించింది.

"మనమేం చెయ్యలేదుగా," అన్నాడు అతను భయం భయంగా.

"ఆ మాట పోలీసులు వినాలిగా," మాధవరావు సమాధానం చెబుతుండగానే దుమ్ము మేఘం మరింత దగ్గరయింది.

"కామ్రేడ్స్! మనకి టైము లేదు. ఒకరు, ఇద్దరుగా అందరూ తలోవైపుకు పారిపొండి," అన్నాడు మాధవ రావు.

"మధూ! నేను నీతోనే వస్తా," అన్నాడు విశ్వం కంగారుగా. అపరిచిత ప్రదేశంలో ఒంటరిగా పారిపో వడం ఎలాగో అతనికి తెలియలేదు.

"మరి ఆలస్యం చెయ్యకు రా," అంటూ మాధవ రావు పరుగుతీశాడు. అతని వెంట విశ్వం పరుగుతీశాడు.

కొంతదూరం పరుగెడుతూ, అలిసిపోయినప్పుడు కొంతదూరం నడుస్తూ, మరి అడుగు పడనప్పుడు నేల మీద కూలిపోతూ అడవివేపుగా పరిగెట్టారు వాళ్లిద్దరూ. అలా దాదాపు పగలంతా ప్రయాణం చేస్తూనే ఉన్నారు.

విశ్వం ఉదయం నుంచి ఏమీ తినలేదు. వాటరు బాటిల్లో నీళ్లు కూడా అయిపోయాయి. మూడు నెలల నుంచీ సరిగా నిద్రాహారాల్లేక నీరసించిపోయాడు అతను. చెప్పలేని నిస్సత్తువ ఆవరించింది. ఒళ్లంతా కుళ్లబొడిచి నట్టుగాను, జ్వరం తగిలినట్లుగానూ ఉంది. తల పగిలి పోతున్నట్టు విపరీతమైన తలనొప్పి- అతనికి కళ్లు తెరిచి ఉంచడం కూడా కష్టంగా ఉంది.

"ఇంక నేను నడవలేను," అన్నాడు విశ్వం కూల బడిపోతూ. మరుక్షణం అతనికి పెద్ద వాంతి అయింది. అప్పటికి సాయంత్రమైంది.

"నువ్విక్కడే ఉండు! అక్కడ ఏదో పాక ఉన్న ట్లుంది- చూసి వస్తా," అన్నాడు మాధవరావు.

అరగంట తర్వాత అతను మరొక వ్యక్తితో వచ్చాడు. ఇద్దరూ విశ్వాన్ని దాదాపు మోసుకువెళ్లారు పాకలోకి.

ఆ పాకలో ఓ పక్కగా గేదె ఒకటి కట్టివేయబడి ఉంది. మరోపక్క మరో పశువు కట్టడానికి స్థలం వుంది కానీ, అక్కడ ఆ సమయంలో పశువు లేదు. కింద గడ్డంతా పేడతో, పశువుల ఉచ్చతో కుళ్లి వాసన కొడు తోంది. అక్కడే కొంచెం ఎండుగడ్డి పరిచి విశ్వాన్ని పడుకో బెట్టారు. అతని శరీరం పెనంలా కాలిపోతోంది. అతను గజగజా వణుకుతూ మెలికలు తిరుగుతున్నాడు. జ్వర తీవ్రతతో మగతగా కన్ను మూసి మూలుగుతూ పలవ రిస్తున్నాడు.

సంచిలోంచి తువ్వాలు తీసి నీళ్ల తొట్టెలో తడిపి విశ్వం నుదిటిమీద ఉంచాడు మాధవరావు. కాళ్లూ, చేతులూ తడి తువ్వాలుతో తుడవసాగాడు. ఓ గంట తర్వాత జ్వరం తగ్గింది. విశ్వం నీరసంగా కళ్లు తెరిచాడు.

"విశ్వం! నీకొచ్చినది మలేరియా లాగుంది," అన్నాడు మాధవరావు.

ఆకాశమంతా మేఘావృతమై చల్లటిగాలి వీయ సాగింది. చినుకు ప్రారంభమై క్షణంలో పెద్ద జడివానగా మారింది. పాకలో కప్పుమీంచి నీళ్లు పడడమే కాకుండా పాకలోనే నీరు ప్రవహించి నేలంతా తడిసిపోయింది.

మళ్లీ విశ్వం జ్వరం పెరగసాగింది అతను గజగజా వణకసాగాడు. మాధవరావు నేలమీద గడ్డివేసి పొడిగా ఉంచుదామని ఎంత ప్రయత్నించినా వీలుపడలేదు. నేలంతా నీటిమయమైపోయింది. ఎన్ని గోనెగుడ్డలు కప్పినా విశ్వం వణుకు ఆగడం లేదు. విశ్వాన్ని మెలితిప్పి నరకయాతన అనుభవించేలా చేస్తోంది.

"ఇంక తెల్లవారుతోందన్నా- ఎవరూ చూడక ముందే వెళ్లిపోవడం మంచిది," అన్నాడు పాకలో ఆతిథ్యమిచ్చిన రైతు.

"విశ్వం! లే," అన్నాడు మాధవరావు చెయ్యి పట్టుకుని.

అడుగు తీసి అడుగు వెయ్యలేకపోతున్నాడు విశ్వం. అతను వర్షంలో తడిసిపోసాగాడు. కాలుతున్న పెనం మీద పడి నీరు ఆవిరైనట్టు అతని శరీరం మీద చినుకులు పడి ఆవిరైపోసాగాయి. అలా గజగజ వణుకు తూనే నడవసాగాడు. కొంతదూరం నడిచి, కొంతదూరం మాధవరావు మోస్తూ, ఈడ్చుకెడుతూ- అలా ఎంతసేపు ప్రయాణం చేశారో విశ్వానికి గుర్తులేదు. బాగా తెల్లవారే టప్పటికి మానవ సంచారానికి దూరంగా దట్టమైన అడివిలో సురక్షిత ప్రదేశంలో చేరారు ఇద్దరూ.

ఆ తర్వాత విశ్వం ఆరోగ్యం బాగా దెబ్బతింది. నాటువైద్యాలకు అతని మలేరియా లొంగలేదు. అతను కొద్దిగా కోలుకుంటుండగా మళ్లా నెలరోజులలో మలేరియా తిరగబెట్టి అతన్ని పీల్చి పిప్పి చేసింది. అతను శారీరకంగా మానసికంగా చాలా నీరసించిపోయాడు.

'లోకం తన దారిన, తోచిన రీతిలో సాగిపోతుంటే దాన్ని మార్చాలనే తహతహతో తను తలెందుకు బ్రద్దలు కొట్టుకోవాలి?' అనే ఆలోచన అతన్ని వేధించసాగింది. అయినా తన ఓటమిని అంగీకరించడానికి అతనికి సిగ్గు వేసింది. చికాకు ఎక్కువైంది.

విశ్వం ఈ రీతిగా వెనక్కు నడుస్తుంటే, మాధవ రావు ఉద్యమంలో మరింత లోతుగా దిగిపోతున్నాడు. అతను విశ్వంలో కలుగుతున్న మార్పులు గమనించ లేకపోలేదు. విశ్వం ఉద్యమంలో ఇంక ఎంతోకాలం ఉండలేడని అతనికి అర్థమైంది.

''విశ్వం! నీ ఆరోగ్యం అంత బాగా లేదు. నువ్వు ఇంటికి వెళ్లిపో! ఆరోగ్యం బాగుపడ్డాక రావాలంటే మళ్లీ రావచ్చు,'' అన్నాడు.

''ఫరవాలేదులే... ఇంకొంత కాలం చూసి...''

''కాదు- వెళ్లిపో! పోలీసు రికార్డులో బహుశా నీ పేరు ఉండకపోవచ్చు. కేవలం సాంస్కృతిక దళ సభ్యుడిగా వాళ్లు నీ మీద నిఘావేసి ఉండొచ్చు కాని, నీ మీద ఏ కేసులూ ఉండి ఉండవు. మన కార్యక్రమా లన్నీ బహిరంగంగానే ఉన్నాయి. నువ్వు వెళ్లిపోవడానికి ఇదే టైము- ఇక ఆలస్యమైతే వెళ్లలేవు...''

మాధవరావు బలవంతం మీద విశ్వం వెనక్కు వచ్చేశాడు. పోలీసులు అతన్ని అరెస్టు చెయ్యలేదు కాని ప్రశ్నించారు. అతను సాంస్కృతిక దళంలోనే కాని లోతుగా లేడనీ, అతను నిజమే చెబుతున్నాడని వాళ్లకు నమ్మకం కలిగింది. అతడిని హెచ్చరించి, తండ్రిని పిలిపించి కుర్రాడిని అదుపులో ఉంచమని చెప్పి వదిలేశారు పోలీసులు.

విశ్వం ఆరోగ్యం పూర్తిగా పాడయింది. అతను ఏం తిన్నా వాంతులయ్యేవి. డాక్టర్లు పరీక్ష చేసి అతని లివర్ కూడా దెబ్బతిందని చెప్పారు. ఎన్ని మందులు మింగినా మలేరియా, లివరుకు సంబంధించిన వ్యాధులు అతన్ని రెండు సంవత్సరాలు పీల్చి పిప్పి చేశాయి.

రెండు సంవత్సరాల తర్వాత అతను క్రమంగా కోలుకున్నాడు కానీ, విప్లవమంటే అతనికి పూర్వపు ఉత్సాహం లేదు. ఉద్రేకం స్థానే నిదానం వచ్చింది.

అదే సమయంలో అతని తండ్రి అకస్మాత్తుగా చనిపోగా కుటుంబ బాధ్యత అతని మీద పడింది. పొలం అమ్మేసి తండ్రి చేసిన అప్పులు తీర్చివేయగా అతని చేతిలో ముప్ఫయి వేలు మాత్రం మిగిలాయి.

జీవితం అతని ముందు ప్రశ్నార్థకంగా నిలిచింది.

''ఇప్పుడేం చెయ్యాలి?'' ఈ ప్రశ్న అతన్ని భయపెడుతోంది.

## 2

అప్పుడు అతని వయసు ఇరవై ఏడు.

విశ్వం జీవితాన్ని ప్రభావితం చేసిన మరొక వ్యక్తి బాల్య స్నేహితుడు సీతారామశాస్త్రి- చార్టర్డ్ ఎకౌం టెంట్‌గా ప్రాక్టీసు చేస్తున్నాడు. మాధవరావు విశ్వాన్ని ఓ వేపు నడిపిస్తే సీతారామశాస్త్రి అతని మరొకవేపుకు నడిపించాడు.

''నాన్నగారు పోయారు కదా! బరువు, బాధ్యత నీమీదపడింది. ఏం చేద్దామనుకుంటున్నావు?'' అన్నాడు పరామర్శలు అయిన తర్వాత.

విశ్వం ఏమీ మాట్లాడలేదు. చదువు దెబ్బతింది. వయసు మీరిపోయింది. ఇప్పుడు ఏం ఉద్యోగం రాదు. అతను అదే ఆలోచిస్తున్నాడు ఆ సమయంలో.

''నేనో మాట చెప్పనా?'' విశ్వం మౌనం చూసి సీతారామశాస్త్రి మళ్లీ అన్నాడు- ''నీకు గుర్తుందో, లేదో- కాలేజీలో కూడా ఈ విషయం గురించి చెప్పాను. మాధవరావూ, నువ్వూ నన్ను పెటీబూర్జువా అని హేళన చేశారు. కానీ, సందర్భం వచ్చింది కాబట్టి నువ్వేమను కున్నా సరే- మళ్లీ అదే మాట చెబుతాను. వినడం, వినకపోవడం నీ ఇష్టం.

''నీలో తెలివితేటలున్నాయి. నీ చదువు, తెలివి తేటలు ఉపయోగించి నువ్వు పైకి రాగలవు. విప్లవం నీలాటివాళ్లకు హాబీ కానీ అవసరం మాత్రం కాదు.

''ఒకవేళ నలుగురి కోసం ఏదో త్యాగం చేద్దామనే ఆవేశంతో దిగితే మాత్రం నీకు నిరాశా, గందరగోళం మిగులుతాయి. ఓ ఆశయం కోసం ఆవేశంలో చావడం తేలికే కానీ, మారుతున్న పరిస్థితుల్లో విశ్వాసం సడలు తుంటే చివరివరకు నిలబడటం చాలా కష్టం. కొమ్మ పట్టుతప్పి అగాధంలో పడ్డట్టవుతుంది నీ పరిస్థితి... పెటీబూర్జువాలా మాట్లాడుతున్నావా?'' సీతారామశాస్త్రి అన్నాడు.

''లేదు, లేదు- చెప్పు,'' అన్నాడు విశ్వం. ఈ మాటలు రెండు సంవత్సరాల క్రితం సీతారామశాస్త్రి అని ఉంటే అలాగే కొట్టిపడేసేవాడు. అతను ఇప్పుడున్న పరిస్థితిలో సీతారామశాస్త్రి చెప్పేది విని ఆలోచించడానికి సిద్ధంగా ఉన్నాడు.

''నువ్వు ఉప్పెనలాంటి ఉద్యమాలు చూస్తు న్నావు కాని, ఆ ఉప్పెన తీసిన తర్వాత బీభత్సం ఎలా ఉంటుందో ఊహించడం లేదు. ఈ ఉద్యమాలన్నీ సుడిగుండాల్లాంటివి. సమీపానికి వెళ్లగానే ఇష్టానిష్టాలతో నిమిత్తం లేకుండా ఊడ్చేస్తాయి. సహనంతో, నేర్పుగా వీటిని తప్పించుకుంటూ జీవన ప్రయాణం చెయ్యాలి కానీ, వివేకవంతుడైన వాడు ఎటుపడితే అటు కొట్టుకుపోకూడదు.

''నీలాగా నేను మార్క్సిజాన్ని అధ్యయనం చెయ్య లేదు. నాకు అర్థమైన దాన్నిబట్టి చూస్తే మార్క్సిజానికి కాలం చెల్లిపోయిందనిపిస్తోంది. కంప్యూటర్ యుగంలో కార్మికవర్గ నియంతృత్వం అంటూ అరవడం హాస్యా స్పదంగా లేదూ? మీ కమ్యూనిస్టులు ప్రచారం చేస్తు న్నట్టు బూర్జువావర్గం తన గొయ్యి తవ్వే సంపన్న వర్గాన్ని సృష్టించిందో లేదో నాకు తెలియదు కానీ కార్మికవర్గం మాత్రం తన గొయ్యి తవ్వే సంపన్నవర్గాన్ని సృష్టించింది.

కమ్యూనిస్టు దేశాల్లో అధికారంలో ఉన్నది కార్మికులే నంటావా, లేక ఈ సంపన్నవర్గం అంటావా? అసలు కార్మికవర్గం ఎక్కడుంది? కమ్యూనిస్టులు అధికారంలో ఉన్నచోటా, లేనిచోటా- ఎక్కడ చూసినా నాయకత్వంలో మధ్య తరగతి లేదా, ధనికవర్గమే కనిపిస్తుంది కానీ కార్మికవర్గం కనిపిస్తుందా; పోనీ కార్మికవర్గం నుంచి వచ్చినవాడు నాయకత్వంలో ఉన్నా వాడు ఆస్తి అధికారం సంపాదించాక కార్మికుడిగానే ఉంటాడా? అసలు ఈనాటి కార్మికుడికి పోయేవి సంకెళ్లు తప్ప మరేవీ లేదా? కొంచెం నిదానంగా ఆలోచించి చూడు. కాలం చెల్లిన ఓ సిద్ధాంతం పట్టుకుని, అస్పష్టమైన ఓ లక్ష్యం పెట్టుకుని, దానికోసం నువ్వు నాశనాన్ని కోరి కౌగలించుకుంటున్నావు.

"ఒకసారి నువ్వు దారి మళ్లావు. ఇప్పుడు సరిదిద్దు కోడానికి మళ్లీ ఒక అవకాశం వచ్చింది. ఈసారి తప్ప టడుగు వేస్తే కోలుకోవడం అసంభవమవుతుంది. నిదానంగా ఆలోచించి నీ మార్గం నిర్ణయించుకో," అని సలహా ఇచ్చాడు సీతారామశాస్త్రి.

"ఏం చెయ్యమంటావు?" విశ్వం అడిగాడు.

"ఏదైనా వ్యాపారం చెయ్యి."

"ఏ వ్యాపారం చెయ్యను? నా దగ్గరున్న డబ్బుతో ఏ వ్యాపారం చెయ్యగలను?"

"ఎంత ఉంది?"

"మొత్తం ముప్పయివేల వరకూ ఉంటుంది."

"స్టాక్‌మార్కెట్ డిప్రెషనులోంచి ఇప్పుడిప్పుడే బయటపడుతోంది. నీ డబ్బు షేర్లలో పెట్టు. నష్టం వస్తే నే సర్దుబాటు చేస్తాలే," అన్నాడు.

విశ్వం ముందు ఓ కొత్త ప్రపంచం వెలిసింది. అతని భాషలో స్టాక్సు, షేర్లూ, బుల్స్, బేర్స్, బ్లూచిప్స్ లాంటి కొత్తపదాలు చేరాయి. మొదట అతను శాస్త్రి సలహా తీసుకుని స్టాక్ మార్కెట్లో దిగినా త్వరలోనే అతను గురువును మించిన శిష్యుడైపోయాడు.

"నీకు ఏలిననాటి శని వదిలింది. ఇంక నువ్వు ఏది పట్టినా బంగారమవుతుంది. నీకు తిరుగులేదు," అన్నాడు శాస్త్రి విశ్వం జాతకం చూస్తూ.

విశ్వం వేళాకోళంగా నవ్వాడు కాని, అతని తల్లి చాలా సంతోషించింది.

ఏ కారణం వల్లనైతేనేమి అతను కొన్న ప్రతీ షేరూ తారాజువ్వలా పైకి లేచింది. స్టాక్‌మార్కెట్ పైకి లేచి లేచి కూలిపోయే దశలో అతను ముందు చూపుతో గ్రహించి కొన్న స్టాకంతా అమ్మేసి నగదుగా మార్చు కున్నాడు.

అప్పటికి అతని దగ్గరా లక్షా యాభై వేలు మిగి లింది. సంవత్సరంలో అయిదు రెట్లు లాభం వచ్చింది. ఇంత లాభం వస్తుందని అతను కలలో కూడా ఊహించలేదు.

"ఇంత నష్టం కూడా రావచ్చు," హెచ్చరించాడు సీతారామశాస్త్రి. "కేవలం దీనిమీదే ఆధారపడకు. వెంక టేశ్వర్రావు కోళ్లఫారం అమ్మేస్తున్నాడట చాలా చౌకలో- అది కొను," అని సలహా ఇచ్చాడు.

"వాడికి నష్టం వస్తోందిట కదా!"

"వాడికి నష్టం వస్తే నీకూ రావాలని ఏం ఉంది? వాడి వ్యసనాలకీ, తిరుగుళ్లకీ - లాభం కాదు - పెట్టుబడే ఎగిరిపోతోంది. జాగ్రత్తగా చేస్తే కోళ్ల ఫారంలో నష్టం రాకూడదు," అన్నాడు సీతారామశాస్త్రి.

"అయినా బాపనోడివి- కోడి సంగతి నీకేం తెలుసు?" అన్నాడు విశ్వం నవ్వుతూ.

"కోడి సంగతి తెలియదు కానీ, అది పెట్టే బంగారు గుడ్డు గురించి మాత్రం తెలుసు," అన్నాడు సీతారామశాస్త్రి తనూ నవ్వుతూ.

విశ్వం కోళ్లఫారం కొన్నాడు. కొబ్బరికాయల వ్యాపారంలో దిగాడు. బియ్యం ఎగుమతి మొదలు పెట్టాడు. అతను అడుగుపెట్టిన చోటల్లా కలిసివచ్చింది. సీతారామశాస్త్రిని జ్యోతిష్యం విషయంలో వేళాకోళం చేసినా అది విశ్వం అంతశ్చేతనలో 'నేనేం చేసినా సక్సెస్ అయి తీరుతుంద'నే ఆత్మ విశ్వాసాన్ని కలిగించింది. అతను ఆత్మవిశ్వాసంతో శక్తియుక్తులన్నీ కేంద్రీకరించి చేసిన ప్రతి వ్యాపారం లాభం సంపాదించి పెట్టింది. అతను త్వరలోనే కొంత వెనకేశాడు.

"సూర్యారావుగారు వాళ్ల రెండో అమ్మాయికి నిన్ను అడుగుతున్నారు," సీతారామశాస్త్రి పెళ్లి సంబంధం తీసుకొచ్చి అన్నాడు.

"ముప్ఫయి నిండాయి- ఇంకెప్పుడు చేసు కుంటాడు పెళ్లి? పెళ్లి చేసుకోరా అంటే వినడంలా," అంది విశ్వం తల్లి కలుగజేసుకుంటూ.

"ఏ సూర్యారావు?" అడిగాడు విశ్వం.

సూర్యారావు ఏ పార్టీ నాయకుడు కాదు కాని, ఖద్దరు పంచె, లాల్చీ వేసుకుని ఎంపీల వెనకాల, ఎమ్మెల్యేల వెనకాల హడావిడిగా తిరుగుతుంటాడు. అతను ఎప్పుడూ ఏ పదవిలోనూ లేడు కాని, పదవిలో ఉన్న వాళ్ల వెనకాల నీడలా ఉంటాడు. నెలకి రెండు మూడుసార్లు పని మీద హైద్రాబాదు వెడుతుంటాడు.

"ఆ చెంచాగాడా? అన్నాడు విశ్వం నిరసనగా.

"తప్పు- పెద్దాయన్ని పట్టుకుని ఏవిటా మాట," అంది తల్లి మందలింపుగా.

"ఏ చెంచాగాడైతేనేం- అమ్మాయి సంసారపక్షంగా బాగానే ఉంటుంది. టెన్తు వరకూ చదివింది. ఏభై వేలు ఇవ్వడానికి సిద్ధంగా ఉన్నాడు," అన్నాడు సీతారామశాస్త్రి.

చివరకు పెళ్లికి ఒప్పుకున్నాడు కాని, కట్నం మాత్రం ససేమిరా తీసుకోనన్నాడు. తల్లి ఎంత దెబ్బ లాడినా ఆ విషయంలో లొంగలేదు.

''ఏం? రేప్పొద్దున వాళ్లబ్బాయి పెళ్లికి ఇంతకు నాలుగురెట్లు లాగడా? నువ్వు తీసుకుంటే తప్పే ముంది?'' అంది తల్లి.

''మీరింక ఈ విషయంలో ఏం మాట్లాడొద్దు. నాది అమాయకత్వమనుకోండి, మొండితనమనుకోండి, మూర్ఖత్వమనుకోండి- ఏవైనా అనుకోండి కాని, ఈ విషయం ఇంక చర్చించవద్దు,'' అన్నాడు విశ్వం పట్టుదలగా.

మాధవరావును వదిలేసి బిజినెస్‌లోకి దిగాక విశ్వం తనలో కలుగుతున్న మార్పు గమనిస్తూనే ఉన్నాడు. 'మాధవరావులా నేను ఆశయానికి అంకితం కాలేకపోవచ్చు కానీ, డబ్బుకి అమ్ముడు పోయేంతగా దిగజారిపోతున్నానా,' అన్న ఆలోచన అతన్ని అప్పు డప్పుడు కలవరపెడుతోంది. 'నా ఆదర్శాలకు నేను పూర్తిగా దూరం కాలేదు,' అని తనకు తాను నిరూ పించుకోడానికి అతను అంత పట్టుదల చూపించాడు కట్నం విషయంలో.

ఆ మాట విన్న మామగారు మాత్రం చాలా సంతోషించారు. ఆయన పెద్దకూతురి పెళ్లిలా రెండో కూతురి పెళ్లిచేయాలని ఏభైవేలు కట్నానికని ఉంచారు. ఆ ఏభై వేలూ తనకే మిగిలినందుకు ఆయన చాలా ఆనందించారు.

''మా అల్లుడుగారు గొప్ప ప్రిన్సిపల్సున్న మని షండి,'' అంటూ- అల్లుడి మంచితనాన్ని, ప్రిన్సిపల్సుని (అవి తనకు లాభించడం వలన కాబోలు) ఆయన తెగ పొగిడారు. 'ఆయన ఇంకోరి సొమ్ము ఆశించరండి,' అంటూ పెళ్లిలో తను ఇద్దామనుకున్న సూట్లూ, బట్టలూ బీరువాలోనే ఉంచేసి క్లుప్తంగా అల్లుడు కోరిన విధంగానే దండల పెళ్లి చేసేశారు.

పెళ్లయి విశ్వం భార్య కాపురానికి వచ్చింది. మొదటి సంక్రాంతి పండుగకు అత్తవారింటికి వెళ్లాడు విశ్వం. మామగారు విశ్వం రాకకు సంతోషించి బట్టలు పెట్టారు. కొత్త సైకిలు కొనిచ్చారు.

''ఎందుకివన్నీ?'' అన్నాడు విశ్వం మొహ మాటంగా.

''ఏంటిది?'' అంది విశ్వం భార్య మాత్రం కరుగ్గా.

''సైకిలే- మీ ఆయనకి,'' అన్నారు విశ్వం మామగారు.

''బావకి స్కూటరిచ్చి ఆయనకి సైకిలేం?'' అంది విశ్వం భార్య ఇంకొంచెం కరుగ్గా, నోరు పెద్దది చేసి.

''పోన్లే సైకిలైతేనేం- ఎంతో దూరం తిరగను కదా!'' అన్నాడు విశ్వం సణుగుతున్నట్లు.

''మీరూరుకోండి,'' అని విశ్వాన్ని ఓ కసురు కసిరి నోరు మూయించేసింది- అప్పటికి పెళ్లయి మూడు నెలలైంది.

''పోన్లేవే- నా స్కూటరు తీసుకోండి,'' అన్నారు మామగారు. రంగు వేయించడం వలన మెరుస్తోంది గాని, అది బొత్తిగా పాత స్కూటరు - రిపెయిర్ తినే స్తోంది. ఎలాగూ అది అమ్మేసి కొత్తది కొనాలను కుంటున్నారాయన.

''ఆ డొక్కు స్కూటరు నువ్వే ఉంచుకో- మా కక్కర్లేదు,'' తండ్రి మాట పూర్తి కాకుండానే అంది విశ్వం భార్య.

''మీరో వెర్రిమాలోకం,'' అని మొగుణ్ని తిట్టి, ''నీకు ఇద్దరు కూతుళ్లూ సమానం కారా,'' అని తండ్రిని నిలేసి, తనకు ఇవ్వాల్సిన ఏభైవేలూ, అల్లుడికివ్వాల్సిన కొత్తస్కూటరూ వస్తే తప్ప మళ్లీ గడప తొక్కనని ప్రతిజ్ఞ చేసి, తిడుతూ, ముక్కు చీదుతూ బయటకు నడిచింది విశ్వం భార్య.

పండగపూట భార్య అలా ప్రవర్తించడం చాలా అనుచితంగా, అసహ్యకరంగా అనిపించింది విశ్వానికి. కానీ, ఆ మాట అనడానికి ధైర్యం చాలలేదు. తను అందరెదుటా కట్నం వద్దని, చాటుగా మళ్లీ పెళ్లాం చేత అడిగిస్తున్నానని మామగారు అనుకుంటున్నారేమోనని విశ్వానికి సిగ్గువేసింది.

''ఇది... ఇది... ఇలా ఎందుకు చేసిందో... నాకు అర్థం కావటం లేదు... నేను అడగ... మన్లేదు,'' అన్నాడు విశ్వం మాటల కోసం తడబడుతూ.

''ఎంతమాట! తప్పుకాదూ- మీ సంగతి నాకు తెలీదా! ఈ రాక్షసి ముం...'' అనబోయిన మాట మింగేసి పళ్లు సైలెంటుగా నూరుతూ అన్నారు మామగారు... ''మీకంటే దాని సంగతి నాకు బాగా తెలుసు- దాని బాబుని నేను...''

చివరకు ఆయన దు:ఖపడుతూ ఏభై వేలూ, కొత్త స్కూటరూ ఇవ్వక తప్పలేదు.

''మీరు మొహమాట పడకండి అల్లుడుగారూ!'' అన్నారు మామగారు కొత్త స్కూటరు తాళంచెవులు అందిస్తూ.

''మీరేంటి అలా మెలికలు తిరిగిపోతారు- ఏదో కాని పని చేసినట్లు? ఆయన మాత్రం జేబులో డబ్బే వన్నా ఇస్తున్నాడా మీకు- ఊరోళ్లందర్నీ కొట్టుకొచ్చిందే గదా! అయినా వాళ్లు మా తమ్ముడికి లక్ష చెప్పడంలా? మనది మనమడగటంలో తప్పులేదు. మీకు డబ్బు

చేదైతే నా పేర వెయ్యండి బ్యాంకులో," అని మొగుణ్ని మందలించింది విశ్వం భార్య.

స్కూటరూ, డబ్బూ అల్లుడికి అందించి, మండి పడుతూ ఇంటికి వెళ్లి, "ఏమేవ్! మన ఆనంద్‌గాడికి ఏ సంబంధం వచ్చినా రెండు లక్షలైతే మాట్లాడమను," అని తన నష్టం వడ్డీతో సహా రాబట్టుకోవడానికి కొడుకు రేటు పెంచేశారు సూర్యారావుగారు.

"ఈ విషయం మగాళ్లను దుమ్మెత్తిపోసే ఫెమి నిస్టులకి చెబితే ఏవంటారో? ఈ సమస్యలన్నీ పురుష సమాజం సృష్టించినవని వాళ్లు మండిపడుతున్నారు కదా," అన్నాడు సీతారామశాస్త్రి విశ్వం చెప్పిందంతా విని నవ్వుతూ.

విశ్వానికి మాత్రం ఈ లోకం తనను ఓ వెర్రి వెంగళప్పగా జమ కడుతున్నదేమోనన్న ఆలోచన బాధించసాగింది. ఆకాశంలో ఎగిరే పక్షిని రెక్కలు విరగ్గొట్టి నేలమీద విసిరేస్తే ఎలా గిజగిజలాడుతుందో అలా గిజగిజలాడేడు విశ్వం - తన ఆదర్శాల ఆకాశం మీంచి నేలమీదకు దిగిన తర్వాత, తను కాళ్లు నిలిపిన వాస్తవ ప్రపంచానికి, తన చూపు నిలిచిన ఆదర్శ ప్రపంచానికి జరిగిన సంఘర్షణలో అతను చాలాకాలం నలిగిపోయాడు. వ్యవస్థ ముందు వ్యక్తి ఎంత దుర్బ లుడో, వ్యవస్థ వ్యక్తి మెడలు వంచి ఎలా లొంగ దీస్తుందో అతనికి అనుభవపూర్వకంగా తెలిసివచ్చింది. అతనిలో లౌక్యానికి ఆదర్శానికి జరుగుతున్న పోరా టంలో చివరకు లౌక్యం గెలువసాగింది. అతని భాషా, వేషం అతనికి తెలియకుండా మారసాగాయి.

లోకంలో తన స్థానం ఏమిటో తెలుసుకోడానికి ప్రయత్నిస్తూ తప్పటడుగులు వేస్తూ అంచెలంచెలుగా విశ్వం పైకి లేస్తున్న సమయంలో మాధవరావు అతని జీవితంలో మళ్లీ ప్రవేశించి అలజడికి కారణమయ్యాడు.

## 3

ఓరోజు రాత్రి తొమ్మిది గంటలకి ఇంటికి చేరే సరికి అతని కోసమే కాసుకుకూర్చున్న అతని భార్య అతను లోపలికి అడుగు పెట్టగానే, "సమయానికి అత్త గారు కూడా లేరు. ఎవరో ముసిలాడు- చచ్చేలా వున్నాడు- మీ చుట్టంట- ఆ గదిలో ఉండమన్నాను - మీవాళ్లో, ఏ దొంగవెధవలో తెలియక భయపడి చస్తు న్నాను. నేనైతే ఎప్పుడూ చూళ్లేదు," అంది చిటపట లాడుతూ.

"నా బంధువులు ఎవరూ," అని ఆశ్చర్యపోతూ గదిలోకి నడిచాడు విశ్వం- ఎదురుగా మాధవరావు.

ఈమధ్యకాలంలో మాధవరావు చాలా మారి పోయాడు. ఎండకి నల్లగా కమిలినట్లు అయిపోయాడు. అతను సన్నగా దృఢంగా కనిపిస్తున్నాడు. అతని కళ్లలో వెలుగూ, ఆవేశం మాత్రం ఇదివరకులాగానే ఉన్నాయి.

మంచం మీద పడుకుని ఆయాస పడుతున్న ముసిలాయన ఏ క్షణంలోనైనా ప్రాణం పోతుందేమో అనేట్లున్నాడు. ఎవరీయన అని అడగబోతూ విశ్వం కొరడాదెబ్బ తగిలినట్టు అదిరిపడ్డాడు.

అతను...

బాబయ్య!

బాబయ్య ఈ అయిదారేళ్లలోనూ చాలా మారి పోయాడు. చాలా వృద్ధుడైనట్లు కనిపిస్తున్నాడు. వెనుకటి దృఢత్వం లేదు.

విశ్వం లోపలికి రాగానే తలుపు మూసి, మెల్లిగా అన్నాడు మాధవరావు - 'బాబయ్య ఆరోగ్యం బాగాలేదు. అసలు మా ఉద్దేశం కలకత్తా తీసుకెడదామని - సగం దారిలో బాగా సీరియస్ అయింది. ఇప్పుడు బాబయ్యని అర్జెంటుగా ఏ కార్డియాలజిస్టుకేనా చూపించాలి. సమ యానికి ఎవరూ దొరకక మీ ఇంటికి తీసుకురావాల్సి వచ్చింది..."

విశ్వం మ్రాన్పడిపోయాడు.

బాబయ్య తలమీద మూడు లక్షల బహుమతి ఉంది. నాలుగు రాష్ట్రాల పోలీసులు అతని కోసం గాలిస్తున్నారు. అతన్ని ఇంట్లో ఉంచడం ఎలా?

"మధు- నీకు తెలుసుగా- నాకు నీ ఉద్యమంతో ఏ సంబంధం... లేదని," అన్నాడు విశ్వం మాటల కోసం తడబడుతూ.

"తెలుసు. కానీ బాబయ్య పరిస్థితి ప్రమాద కరంగా ఉంది. అందుకని..."

విశ్వానికి భయం వేసింది. చీకాకు కలిగింది. తను ఎంతో పదిలంగా కట్టుకున్న ఈ గూడు మళ్లీ ఏ గాలి వానకు ఎగిరిపోతుందోనన్న ఆందోళన కలిగింది.

"నువ్వు పొరపాటు చేశావు- నన్ను మళ్లీ ఇందు లోకి దింపకు," అని ఏదో చెప్పబోతుండగా అతనికి భార్య గుర్తుకు వచ్చింది.

గబగబా గదిలోంచి బయటికి వచ్చి భార్యను పిలిచి- "మీ అమ్మకి ఆరోగ్యం బాగాలేదుట- మీ నాన్న గారు మార్కెట్లో కనిపించి చెప్పారు. నిన్ను ఓ వారం రోజులపాటు పంపించమన్నారు సాయంగా..." అన్నాడు.

మామగారు కనిపించడం, అత్తగారి అనారోగ్యం, భార్యని పంపించమనడం- అతను అంతా నిజమే చెప్పాడు.

"మా అమ్మకి ఆస్తమా వచ్చుంటుంది," అంది ఆమె మామూలుగా.

"పద- మీ ఇంటి దగ్గర దిగపెడతాను," అన్నాడు విశ్వం స్కూటరు తీస్తూ.

"ఇంత రాత్రెందుకు - రేపెళ్లచ్చులే."

"కాదు- ఇప్పుడే వెళ్లాలి! రేపు నాకు తీరికలేదు," అన్నాడు విశ్వం చికాగ్గా. బాబయ్యా, మాధవరావూ ఇంట్లో ఉన్నంతకాలం భార్య అక్కడుండటం ఇష్టం లేదు అతనికి.

"ఆ ముసిలోడు..."

" ఆ ముసిలోడి సంగతి నే చూసుకుంటా కానీ నువ్వు అట్టే వాగక నడు," అన్నాడు విశ్వం పెద్దగా అరుస్తూ. మొగుడికి హఠాత్తుగా అంత కోపం ఎందుకొచ్చిందో ఆమెకి అర్థం కాలేదు. మారుమాట్లాడకుండా సంచిలో అవసరమైన బట్టలు సర్దుకొని స్కూటరెక్కింది. అత్తవారింటి దగ్గర భార్యని దింపేసి ఓ గంటలో మళ్లీ వచ్చాడు విశ్వం.

"ఇప్పుడేం చేద్దాం?" విశ్వం అడిగాడు ఆత్రుతగా.

బాబయ్యకి ఊపిరాడటం లేదు. డొక్కలు ఎగరేస్తున్నాడు. ఇంట్లో ఇక్కడే చచ్చిపోడుకదా అని భయం వేసింది విశ్వానికి. ఒకవేళ ఇక్కడే చచ్చిపోతే శవాన్ని ఏం చెయ్యాలి? ఎలా దహనం చెయ్యాలి? అతనికి అంతా కంగారుగా ఉంది.

"బాబయ్యని హాస్పిటల్లో చేర్పించాలి," అన్నాడు మాధవరావు.

"గవర్నమెంటు హాస్పిటలైతే లాభంలేదు- ఎవరైనా గుర్తుపట్టవచ్చు. ఈమధ్యే అమెరికా నుంచి వచ్చిన ఒకాయన నర్సింగ్‌హోం పెట్టాడు. అది ఊరికి దూరంగా ఉంది. ఆయన ఫీజు కూడా చాలా ఎక్కువ. అందుచేత అక్కడ చాలా ఖరీదైన పేషంట్లే ఉంటారు. అక్కడైతే బాగుంటుంది. ఎవరికీ అనుమానం రాదు," అన్నాడు విశ్వం.

"అక్కడే చేర్పిద్దాం."

"పోలీసుల దగ్గర నీ ఫొటో ఉందంటావా?"

"ఉండే ఉంటుంది," అన్నాడు మాధవరావు.

విశ్వం కొంచెం ఆలోచించి బీరువాలోంచి తన సిల్కు లాల్చీ, గ్లాస్కో పంచెతీసి మాధవరావు కిచ్చాడు. అతని మెడలో బంగారు గొలుసు వేశాడు. ఎడం చేతికి మూడు ఉంగరాలూ, ఖరీదైన రిస్టువాచీ తగిలించాడు. పగలూ, రాత్రీ ఉపయోగించడానికి వీలుగా ఉండే తన ఫొటోక్రొమేటిక్ కళ్లద్దాలు ఇచ్చాడు. మధ్య పాపిడి తీసి హెయిర్‌స్టెయిల్ మార్చగానే మాధవరావు రూపం పూర్తిగా మారిపోయింది.

మాధవరావు మేకప్ పూర్తయిన తర్వాత విశ్వం పరిశీలనగా చూసి, తృప్తిగా తలాడించింది- "ఫొటో పాతది ఏదైనా ఉన్నా ఈ వేషంలో నిన్నెవరూ గుర్తుపట్టలేరు," అన్నాడు.

శవంలా ఉన్న బాబయ్యను గుర్తుపట్టే సమస్యే లేదు. అతని ముఖకవళికలూ, శరీరం అంతగా మారిపోయాయి. బాబయ్యకి దుప్పటి కప్పి, ఓ మఫ్లర్ తలకి చుట్టారు.

నర్సింగ్‌హోంలో బాబయ్యను మారు పేర్లో చేర్పించారు. ఆయనకు ప్రత్యేకంగా ఓ గది ఇచ్చారు. అక్కడ డాక్టర్లు బాబయ్యను శ్రద్ధగా పరిశీలించి అతని గుండె చాలా బలహీనంగా ఉందనీ, కనీసం ఒకటి రెండు వారాలైనా బెడ్‌రెస్టు కావాలని చెప్పారు.

మొదటిరోజున బాబయ్యని నర్సింగ్‌హోంలో చేర్పించినప్పుడు కూడా వెళ్లినా, తరువాత అటువైపు వెళ్లలేదు విశ్వం. మాధవరావు మాత్రం బాబయ్యను నిరంతరం కనిపెట్టుకునే ఉన్నాడు.

వారంరోజుల తరువాత బాబయ్య పరిస్థితి కొంచెం మెరుగైంది. అదే సమయంలో ఆందోళన కలిగించే వార్త ఒకటి తెలిసింది. బాబయ్యకు అనారోగ్యంగా ఉందనీ, ఎక్కడో వైద్యం చేయిస్తున్నారని పోలీసులకి తెలిసిపోయింది.

"బాబయ్య బెంగుళూరులో ఉన్నాడని అనుమానించి పోలీసులు బెంగుళూరంతా గాలిస్తున్నారు. అక్కడ ఆచూకీ దొరకకపోతే- ఇక్కడ కూడా వెతకొచ్చు బాబయ్య పరిస్థితి మెరుగైంది కాబట్టి వెళ్లిపోవడం మంచిది," అన్నాడు మాధవరావు విశ్వంతో.

బాబయ్యను హాస్పిటల్లో చేర్చిన మాధవరావు మళ్లీ విశ్వాన్ని కలవడం ఇదే. విశ్వానికి మాధవరావుతో మాట్లాడ్డానికి కొద్ది సమయం చిక్కింది వారంరోజుల తర్వాత.

"మధూ! మీ నాన్నగార్ని ఈమధ్య ఎప్పుడైనా కలిశావా! ఎలా ఉన్నారు?" అడిగాడు విశ్వం.

"నాకు తెలియదు- మా ఇద్దరి మధ్య సంబంధాలు తెగిపోయి పదేళ్లయింది. ఆయన పేకాట, త్రాగుడు అంతా సవ్యంగా సాగిపోతున్నాయనుకుంటాను," అన్నాడు మాధవరావు.

"మీ పిన్ని?"

"ఆవిడకి అసలే పట్టదు- అమ్మయితే..."

మాధవరావు ఆగిపోయాడు. ఎప్పుడో పసితనంలో, తనకు అయిదేళ్లు నిండకుండానే చచ్చిపోయిన అమ్మ రూపం అతని కళ్ల ముందు అస్పష్టంగా మెదిలింది. తల్లి తనను ఎత్తుకొని ముద్దులాడటం, తండ్రి తాగివచ్చి తల్లి జుట్టు పట్టుకొని గోడకేసి కొడుతూంటే తను భయంతో, ద్వేషంతో తలుపు చాటునుంచి చూస్తూ నిలబడటం అతనికి గుర్తు వచ్చింది.

''మధూ!'' విశ్వం కొంచెం ఆగి అన్నాడు- ''...ఆనాటికీ ఈనాటికీ నా భావాలు చాలా మారాయి. పోరాటం నుంచి పారిపోయి నన్ను నేను సమర్థించుకోడానికి ఇలా అంటున్నాననుకోకు. ప్రపంచంలో జరిగే మార్పులు చూస్తుంటే అసలు మార్క్సిజం కూడా ఆచరణ సాధ్యం కాని ఒక ఉటోపియా అనిపిస్తోంది. కమ్యూనిస్టు ప్రపంచంలో జరుగుతున్నది చూడు. మన కమ్యూనిస్టుల్ని చూడు...''

''మన కమ్యూనిస్టులా?'' మాధవరావు నిరసనగా అన్నాడు- ''వీళ్లంతా లక్కపిడత మనుషులు. వీళ్లవి చింతపిక్క మెదళ్లు. చెదపురుగులకి మార్క్సిజం ఎంత అర్థమవుతుందో వీళ్లకీ అంతే. వీళ్లకి సొంత మెదళ్లు లేవు; సొంత ఆలోచనలు లేవు. వాళ్లు నిలబడ్డ నేల, కాలం వాళ్లకి అర్థంకాదు. ఒకప్పుడు అతివాదం, ఒకప్పుడు మితవాదం, తరచుగా పచ్చి అవకాశవాదం- ఇదీ వీళ్ల చరిత్ర. వీళ్ల వ్యూహాలు, ఎత్తుగడలూ, కుప్పిగంతులూ, వీళ్లను కుర్చీలకి దగ్గర చేశాయేమో కానీ ప్రజలకు మాత్రం బాగా దూరం అయిపోయారు...''

''...పోనీ వాళ్లని రివిజనిస్టులని మీరు నిందించినా మీ సంగతేమిటి? ముక్కచెక్కలై ముప్ఫయి గ్రూపులయిన మీ పార్టీ, టెర్రరిస్టు పద్ధతులూ, సెన్సేషన్ కలిగించి హెడ్‌లైన్సుకెక్కి మేం ఇంకా ఉన్నామని చెప్పడానికే తప్ప విప్లవ లక్ష్యానికి ఏ మాత్రం సంబంధంలేని చర్యలూ- ఇదంతా చూస్తే నీకేమనిపిస్తుంది? అసలు విశాలమైన ఈ దేశంలో ఏదో మారుమూల ప్రాంతంలో నాటు తుపాకులతో జరిగే సాయుధ పోరాటం సుశిక్షితులైన పోలీసుల్నీ, సైన్యాన్నీ ఎదిరించి నిలవగలదనుకుంటున్నారా? తెలంగాణ, శ్రీకాకుళం పోరాట అనుభవాలు మీకు అర్థంకాలేదా లేక గుడ్డిగా నిజం చూడటానికి నిరాకరిస్తున్నారా? మీరు సృష్టిస్తున్న ఈ హింస ఎటు దారితీస్తుందో ఆలోచిస్తున్నారా?'' విశ్వం అడిగాడు.

''ఈ హింసకి కారణం నక్సలైట్లేననీ, వాళ్ల పద్ధతులు మార్చుకున్నా, లొంగిపోయినా ఇది ఆగిపోతుందనీ చాలామంది మేధావుల్లా నువ్వూ అభిప్రాయపడుతున్నట్లుంది. అది సరికాదు.

''నిజం ఏమిటంటే- స్వతంత్రం వచ్చిన తర్వాత ఈ దేశం రెండుగా చీలిపోయింది. అభివృద్ధి ఫలితాలన్నీ చేజిక్కించుకున్న ఓ దేశం ఫైవ్‌స్టార్ హోటల్సు- కలర్ టీవీలు అంటూ ఇరవై ఒకటో శతాబ్దంలోకి దూసుకుపోతోంది. తన విలాసాల కోసం దేశాన్ని అప్పులపాలు చేసి దివాలా తీయిస్తూ ఆ అప్పుల భారాన్ని సామాన్య ప్రజానీకం మీదకు నెట్టుతోంది. ఈ దేశంలో కేవలం బూర్జువావర్గమే ఉందనుకోకు. మధ్యతరగతి, ధనిక రైతాంగం, మేధావులూ, ఉద్యోగులూ, సొసైటీలో లంపెన్ ఎలిమెంట్సు, వెనుకబడిన కులాలలో, షెడ్యూల్డు కులాల్లో- చివరికి కార్మికవర్గంలో కూడా నోరున్న ఓ మైనారిటీ చేరి ఉన్నాయి. రాజకీయార్థిక సామాజిక రంగాలన్నీ ఈ సంపన్న దేశం తన గుప్పెట్లోకి తెచ్చుకుని ఈ వ్యవస్థని ఇలా శాంతియుతంగా కొనసాగించడంలో స్వార్థం ఉంది.''

మధు చెబుతున్న మాటల్ని విశ్వం శ్రద్ధగా వింటున్నాడు.

''కానీ మరో మూగదేశం- అధిక సంఖ్యాక దేశం- ఇంకా అజ్ఞానంలో, అంధకారంలో, దారిద్ర్యంలో కొట్టుమిట్టాడుతూ అన్నమో రామచంద్రా అని అలమటిస్తోంది. అప్పుడప్పుడు, అక్కడక్కడ నక్సలైట్ల తుపాకీ గొట్టాల్లోంచి తన గొంతు వినిపించడానికి ప్రయత్నిస్తోంది.

''ఈ రెంటికీ అనివార్యమైన సంఘర్షణ వర్గాల్ని, కులాల్ని అధిగమిస్తూ- మన పుస్తకాల పురుగులు ప్రవచించే వర్గపోరాట చట్రంలో ఇమడక, వార్ని గందరగోళపరిచి వాళ్ల మతులు పోగొడుతోంది. ఈ సంఘర్షణ నక్సలైట్లు సృష్టించింది కాదు- వాళ్లు ప్రతిబింబిస్తున్న సమస్య. నక్సలైట్లు ఈ సమస్యని అసమర్థంగా దేశం ముందుకు తీసుకువస్తుండవచ్చు. బహుశా నువ్వు చెప్పిన అనేక కారణాల వల్ల ఈ పోరాటాలు పోలీసులనెదిరించి నిలబడలేకపోవచ్చు. అణచివేయబడొచ్చు...''

''మరయితే... ఇదంతా... ఇదంతా ఎందుకు?'' అన్నాడు విశ్వం తెల్లబోయి.

''ఇదంతా ఎందుకంటే,'' మాధవరావు నిట్టూర్చి మొదలుపెట్టాడు.

''...నాలుగేళ్ల క్రితం అనుకుంటాను- మా దళం ఓరోజు అడవిలో వెడుతుంటే ఓ పసివాడి ఏడుపూ, కేకలూ వినిపించాయి. అటువేపు పరిగెట్టి చూస్తే ఓ

ఆరేడేళ్ల పసివాడు చింతచెట్టు మీంచి గావుకేకలు పెడుతున్నాడు. ఎంతసేపటి నుంచీ వాడు అలా ఉన్నాడో తెలియదు కానీ వాడి గొంతుక ఎండిపోయింది. శబ్దం కూడా సరిగా రావటంలేదు. చెట్టు కింద రెండు తోడేళ్లు వాడికోసం కాసుక్కూర్చున్నాయి. మేం తోడేళ్లను తరిమేసి, వాడిని చెట్టుమీంచి దింపి, నీళ్లు త్రాగించి, బుజ్జగించి ఏం జరిగిందని అడిగాం.

"ఇంట్లో రెండు రోజుల్నుంచి తినడానికేవీ లేదట. అంతకుముందు రోజు ఉదయమనగా ఎక్కడికో వెళ్లిన వాడి అమ్మా, నాన్నా ఇంటికి తిరిగి రాలేదట. వాడు, వాడి చెల్లి- ఏడాదిన్నర వయసుది- గుడిసెలో ఉన్నారు. రాత్రి వాడు భయంతో, ఆకలితో అలాగే పడుకున్నాడు. వాడి చెల్లెలు ఏడ్చి సొమ్మసిల్లి నిద్రపోయింది. ఓ రాత్రివేళ చెల్లి ఏడుపు మళ్లీ వినిపిస్తే మెలకువ వచ్చి చూశాడు, చెల్లెల్ని తోడేళ్లు లాక్కెళ్లిపోతున్నాయి. వాడి మీదకు కూడా వచ్చాయి. వాడు పారిపోయి చింతచెట్టు ఎక్కగలిగాడు. రాత్రి నుంచీ ఆ చెట్టుమీంచి అలా అరుస్తూనే ఉన్నాడు. అడవిలో ఓ మూల విసిరేసినట్టు ఆ గుడిసె ఉండటం మూలాన ఎవరికీ వినిపించలేదు వాడి ఏడుపు. ఏడుస్తూ, వణుకుతూ వాడు ఆగి ఆగి చెప్పిన కథ అది.

"గుడిసెకి కొంచెం దూరంలో పొదల్లో తోడేళ్లు తినగా మిగిలిన పసిపాప శవం కనిపించింది. వెదకగా వెదకగా సాయంకాలానికి వాడి తల్లిదండ్రులు మైలు దూరంలో కనిపించారు- చెట్టుకొమ్మకి వేళ్లాడుతూ. తల్లిదండ్రులు ఉరేసుకుని తమ ప్రాణాలు తీసుకోగలిగారు కానీ పిల్లల ప్రాణాలు తియ్యలేకపోయారు. వాళ్ల శవాలను చెట్టుమీంచి దింపి దహనం చేసి ఆ కుర్రాడిని ఇంకో గిరిజన గూడెంలో వదిలాం-

"విశ్వం! నాకొకటి అర్థంకాదు. శాంతి, అహింస అంటూ కాకిగోల చేసే మన మేధావులకి దరిద్ర భారతంలో నిత్యం జరుగుతున్న ఈ హింస కనిపించదా? వాళ్ల కళ్లు మూసుకుపోయాయా, లేక వాళ్లలో నిజాయితీ చచ్చిందా? లేకపోతే ఈ నరక జ్వాలలు వాళ్లనీ, వాళ్ల ముద్దుబిడ్డల్నీ ఎన్నడూ తాకలేనంతటి దూరంలో క్షేమంగా ఉన్నారు కాబట్టి ధర్మపన్నాలు వల్లిస్తూ, శాంతి బోధనలు చేస్తున్నారా?

"...నా మటుకు నాకు ఇంత ఘోరం జరుగుతుంటే ఏమీ పట్టనట్లు చేతులు ముడుచుకు కూర్చోలేననిపిస్తుంది. అసలు ఎందుకిదంతా అన్న ప్రశ్న ఉదయించినప్పుడల్లా అడవిలో ఒంటరిగా, నిస్సహాయంగా ఏడుస్తున్న పసివాడు కళ్ల ముందు మెదులుతాడు. తోడేళ్లు పీక్కుతిన్న పసిపాపా, కొమ్మకి వేళ్లాడుతున్న అర్ధనగ్న శరీరాలూ కనిపిస్తాయి. అజ్ఞానంలో, దారిద్ర్యంలో వాడిపోయి, రాలిపోతున్న లక్షలాది ఎర్ర గులాబీలు గుర్తుకొస్తాయి. ఈ దుర్భర పరిస్థితి ఇలా కొనసాగనివ్వకూడదనిపిస్తుంది. ఈ నిర్భాగ్యుల్ని కొల్లగొట్టి వేల కోట్లు కూడబెట్టి విలాసాల్లో మునిగి తేలుతున్న లంజాకొడుకుల్ని గొడ్డలితో నరికి ముక్కలు ముక్కలు చెయ్యాలనిపిస్తుంది. నా కొడకల్లారా- ఈ దేశం మీ అబ్బ సొత్తు కాదురా అని జుట్టు పట్టుకుని..."

మాధవరావు ఇంత వయస్సు వచ్చినా ఏమీ మారలేదు- మాటల్లో అదే ఆవేశం, కళ్లల్లో అదే తీక్షణత. అతను ఎర్రబడ్డ కళ్లతో పిడికిలి బిగించి ఊపుతూ మాట్లాడసాగాడు.

"... ...ఆవును కట్టేసి పాలు పితికినట్టు ఈ మూగ దేశాన్ని చట్టాలతో బంధించి, పైన పోలీసులాఠీ ఉంచి, గింజుకున్నప్పుడల్లా కోర్టులూ, జైళ్లూ చూపిస్తూ - పాలు కాదు- రక్తం పిండుతున్నారు లంజాకొడుకులు. ఈ గంగిగోవు భరించలేక కొమ్ము విసిరినప్పుడల్లా శాంతికి భంగం కలిగిందని సాయుధమూకల్ని దింపుతున్నారు. ఈ దుర్మార్గాన్ని డెమోక్రసీ అంటున్నారు. ఇదే డెమోక్రసీ అయితే దాని మొహం మీద ఉమ్మేస్తాను నేను. ఇదే స్వేచ్ఛ అంటే ఆ స్వేచ్ఛని నిర్దాక్షిణ్యంగా కాళ్ల క్రింద తొక్కి పడేయాలంటాను..."

మాధవరావు ఆవేశం విశ్వానికి కూడా ప్రాకి క్షణకాలం అతను పాత విశ్వం అయ్యాడు. మరుక్షణం తన్ను తాను నిగ్రహించుకుంటూ అన్నాడు-

"మధూ! ఆవేశపడినంత మాత్రాన విప్లవం రాదు. దేశంలో మెజారిటీ ఇంక విప్లవం తప్ప గత్యంతరం లేదు అనే నిర్ణయానికొచ్చి ప్రాణాలకు తెగించి కదలినప్పుడే విప్లవం అవుతుంది. ఈనాడు ఆ పరిస్థితి ఉందంటావా?"

"దేశంలో ఆ పరిస్థితి లేదు- నిజమే?" మాధవరావు అన్నాడు, "ఈ దేశంలో ఆ మార్పు ఎప్పుడు, ఏ రూపంలో ఎలా వస్తుందో ఎవరూ జోస్యం చెప్పలేరు. విప్లవం కనుచూపు మేరలో లేదు కాబట్టి అధర్మం వెయ్యి హస్తాలతో నిన్ను చుట్టుముట్టుతున్నప్పుడు నువ్వు నిస్సహాయంగా చూస్తూండిపోవాలా? నా ఉద్దేశం ఏవిటంటే- జయాపజయాలతో నిమిత్తం లేకుండా నీ శక్తి మేరకు నువ్వు అక్రమాలని ప్రతిఘటించి తీరాలి. నువ్వు ఏ మేరకు ప్రతిఘటిస్తే ఆ మేరకు అధర్మం బలహీనపడుతుంది. ఆ పోరాటాల అనుభవం నీకు మార్గనిర్దేశం చేస్తుంది. ఓడిపోయి, అణచివేయబడ్డ పోరాటాలను నేను ఈ దృష్టితోనే చూస్తాను.

"అణచివేయబడ్డా మళ్లీ మళ్లీ మరొకచోటా, మరో రూపంలో తలెత్తుతున్న ఈ పోరాటాల్ని చూస్తే అణచి వెయ్యడం అంత తేలిక కాదు అనీ, నివురుకప్పిన నిప్పులా ఆరిపోయినట్టు కనిపిస్తూనే లోలోపల ప్రజ్వరిల్లుతోందనీ స్పష్టం కావడంలేదూ?" అన్నాడు మాధవరావు.

"మధూ! ఈ పోరాటాలు నడిపేందుకు ఒక పార్టీ, దానికి ప్రజల్ని ఉత్తేజితుల్ని చెయ్యగలిగిన స్పష్టమైన సిద్ధాంతం ఉండాలి. ఒకప్పుడు ప్రపంచాన్ని ఊపేసిన మార్క్సిజం, సోషలిజం, కమ్యూనిజాలు ఇప్పుడు వ్యర్థ పదాలుగా మిగిలిపోయాయి. ఇప్పుడు కమ్యూనిస్టంటే దగుల్బాజీ అన్న అర్థం ధ్వనిస్తోంది. కమ్యూనిజానికి పుట్టినిల్లు కేపిటలిజానికి తలుపులు తెరుస్తుంటే మీరు ఈ కాలంలో ఆ శుష్కనినాదాలు ఇక్కడ ఇవ్వడం హాస్యాస్పదంగా లేదూ? ప్రజలు మీ మాటలు ఎలా విశ్వసిస్తారనుకుంటున్నావు? మీరు మారుతున్న కాలాన్ని గుర్తించడం లేదు..."

"కాలం మారుతుంది- నిజమే నిన్న ఉన్నట్టు నేడు ఉండదు. నేడు ఉన్నట్టు రేపు ఉండదు. కాలం నిరంతరం సాగుతూనే ఉంటుంది. శాశ్వత సత్యాలు ఏవీ లేవనీ, మారే పరిస్థితులను దృష్టిలో ఉంచుకుని మార్గం, గమ్యం నిర్ణయించుకోమని మార్క్సిజం చెబుతుంది. నిజమైన మార్క్సిస్టు కాలంతోపాటు ముందుకు కదలాలి. సమస్యలకి సమాధానాలు సమకాలీన సమాజంలో వెతకాలి. కాని, కమ్యూనిస్టులు మార్క్సిజాన్ని మూఢవిశ్వాసంగా మార్చేసి, మారుతున్న కాలంతోపాటు ప్రవహించకుండా, నిలువ నీరులా నిలిచిపోయి పడికట్టు పదాలతో కంపుకొట్టసాగారు. వాళ్ల మాటలకీ, చేతలకీ పొంతన లేకుండాపోయింది. ఆ నిలవనీటిలో చెత్తా చెదారం తేలినట్లు కమ్యూనిస్టుల్లో సామాన్య ప్రజా జీవనంతో సంబంధంలేని కెరీరిస్టులు నాయకత్వంలోకి తేలేరు.

"రష్యాలో కమ్యూనిస్టుల కాళ్లు నేలమీదా, వేళ్లు ప్రజల్లోనూ ఉన్నంతకాలం హిట్లరులాంటి రాక్షసశక్తి కూడా వాళ్లని నాశనం చెయ్యలేకపోయింది. కానీ, వాళ్లు మార్క్సిజాన్ని ఆచరణలో వదిలేసి తాత్వికంగా నిరాయుధులైపోయిన తర్వాత శత్రువెవరో, మిత్రుడెవరో గుర్తించలేని గుడ్డివాళ్లయిపోయారు. ఇంటా-బయటా ఉన్న శత్రువు స్టాలినిస్టు చరిత్ర అంతా రక్తసిక్తంగా చిత్రించి పెద్ద ఎత్తున 'డిజ్ ఇన్‌ఫర్మేషన్' మొదలుపెడితే ఆ ప్రచార స్వభావాన్ని అర్థం చేసుకోకుండా తప్పులు సవరించే పేరుతో తల తెగ్గొట్టుకున్నారు. వర్గరహిత సమాజం అంటూ సోషలిస్టు సమాజంలో ఒక కొత్త దోపిడీవర్గం అవతరించిందన్న సత్యాన్ని చూడ నిరాకరించారు. డెమొక్రసీ అంటూ కార్మికవర్గ పార్టీని ప్రజల పార్టీగా మార్చేసి కార్మికవర్గాన్ని నిరాయుధం చేసి దాని నోటికి, చేతికి సంకెళ్లు తగిలించారు.

"ఈ పరిస్థితి ఒకరోజులో రాలేదు. గత మూడు దశాబ్దాలుగా క్రమంగా మారుతూనే ఉంది. ఇది ఇలా ఎందుకు జరిగిందీ, సోషలిస్టు సమాజం అన్న దానిలో ఏ పరిస్థితుల్లో ఈ నయా దోపిడీవర్గం అవతరించి- ఎలా క్రమంగా అధికారం చేజిక్కించుకున్నదీ, కమ్యూనిస్టుల వైఫల్యాలు- ఈ సమస్యలన్నీ నిర్మొహమాటంగా చర్చించి సరైన సమాధానాలు చెప్పనిదే సోషలిస్టు ఉద్యమం ముందంజ వెయ్యదు. అసలు సమస్యలు దాటవేసి ఇదంతా కేవలం సామ్రాజ్యవాదుల కుట్రగానో, కొంతమంది ద్రోహుల వెన్నుపోటుగానో చిత్రించి డబాయించితే ప్రయోజనం లేదు.

"ఏది ఏమైనా హిట్లరు నుండి ఇందిరాగాంధీ దాకా- అన్ని రకాల నోళ్లలోనూ నలిగి నలిగి బూతు మాటగా ధ్వనిస్తున్న సోషలిజం మాత్రం ఉటోపియా కాదు- చరిత్ర గమ్యం. చరిత్ర పరిణామాన్ని గమనిస్తున్న వారి కెవరికైనా, నీరు ఎత్తు నుంచి పల్లానికి ప్రవహించినట్టు, మానవ సమాజం అసమానత నుంచి సమానత వేపుగా ప్రయాణిస్తోందని యత్నం విఫలమైనంత మాత్రాన ఈ ప్రయాణం ఆగిపోయిందనుకోవడం, ఇంక ప్రపంచంలో పీడితుల పోరాటాలు ఆగిపోతాయనడం భ్రమ మాత్రమే.

"సోషలిజం కోసం పోరాడడమంటే- ఎర్రజెండా ఎగరెయ్యడం మాత్రమే కాదు- ఒక నూతన వ్యవస్థ, నూతన సంస్కృతి, నూతన మానవుడి కోసం సుదీర్ఘ కాలం జరిగే పోరాటం. నేటి మనిషి నరసింహమూర్తి- సగం మనిషి, సగం జంతువు. వ్యక్తి స్వేచ్ఛ పేరుతో వాడిలోని జంతువును వదిలేస్తే అది వాడిని మృగంగా మారుస్తుంది. ఆ మృగానికి లాభాలవేట తప్ప మానవత్వం ఉండదు. సోషలిస్టు వ్యవస్థలో వైఫల్యానికి పరిష్కారం స్వేచ్ఛావిపణి కాదు. స్వేచ్ఛావిపణి లాభనష్టాల తిరగలి రాళ్ల మధ్య సామాన్యుడి బ్రతుకు పిండి పిండి కాకూడదు.

"మనిషిలోని మనిషిని ప్రోత్సహించి, వాడిలోని జంతువుకు సంకెళ్లు వేసి ఉంచేదే సరైన వ్యవస్థ. మనిషిలోని జంతువు పూర్తిగా నశించి సంపూర్ణ మానవుడిగా పరిణామం చెందనిదే సోషలిజం విజయవంతం కాదు. నిజమైన సోషలిజానికి, నకిలీ సోషలిజానికి తేడా మనం

స్పష్టంగా అర్థం చేసుకుని ప్రజలకు చెప్పాలి. చరిత్ర సూటిగా నడవదనీ, వంకరటింకరగా పురోగమిస్తుందనీ, ఈ దారిలో వైఫల్యాలు సహజమనీ మనం ప్రజలకు వివరించి సోషలిజం భవిష్యత్తులో వాళ్లకు విశ్వాసం కలిగించాలి.

"ఇక్కడ ప్రజలు మార్పు కోరడం లేదనడం నిజం కాదు. ఎవరొచ్చి ఈ దౌర్భాగ్య దేశాన్ని ఉద్ధరిస్తారా అని వాళ్లు వెయ్యి కళ్లతో ఎదురు చూస్తున్నారు. కానీ, వాళ్లకు ఎవరిలోనూ విశ్వాసం లేదు. వాళ్ల కోసం మనం ప్రాణాల కేనా తెగించి నిలబడతాం అన్న విశ్వాసం వాళ్లలో కలిగించాలి. ఈ పోరాటం అంత తేలిక కాదు అని తెలుసు. చిక్కుముడి లాంటి వర్తమానం ఒక పట్టాన అర్థం కాదు. పడుతూ, లేస్తూ తప్పుదారి పోయినప్పుడు వెనక్కు మళ్లుతూ, కాలంలో దారి చేసుకుంటూ ముందుకు వెళ్లడం తప్ప వేరే మార్గం లేదు." అన్నాడు మాధవరావు.

"మధూ! నువ్వు కాలానికి ముందున్నావో, వెనకున్నావో నాకు అర్థం కావడం లేదు. నువ్వు వెళ్లే దారి ఎటువంటిదో తెలిసే నడుస్తున్నావు. ఇంక నేను చెప్పేది ఏమీ లేదు. ఒకవేళ నువ్వు ఎప్పుడైనా మనసు మార్చుకుని బయట పడాలనుకుంటే నీకు ఏ సహాయం కావాలన్నా చేస్తాను. శాస్త్రి కూడా నీతో మరీమరీ చెప్ప మన్నాడు. ఇన్ని పోలీసు కేసులతో నువ్వు ఆంధ్రదేశంలో ఉండలేవు- అది మాకు తెలుసు.

"నిన్ను ఢిల్లీ, బాంబే - ఒక మెట్రోపాలిటిన్ సిటీకి పంపించే ఏర్పాటుచేస్తాం. పోలీసు రికార్డులో నీ పేరు పాతబడిపోయే వరకూఓ అయిదు - పది సంవత్సరాలు అక్కడే గడపొచ్చు" అన్నాడు విశ్వం.

మాధవరావు నవ్వాడు కానీ సమాధానం చెప్ప లేదు.

అప్పటికి తెల్లవారుజాము మూడు గంటలవు తోంది. ఇంక లోకం తెల్లవారడానికి రెండు గంటలు - మాధరావు జీవితం తెల్లవారడానికి నాలుగు సంవత్స రాలు మాత్రమే ఉంది.

## 4

నాలుగు సంవత్సరాల తర్వాత ఆ రోజు...

ఉదయాన్ని సూచిస్తూ తూరుపు కొద్దిగా తెల్లబడ్డా ఇంకా చీకటి విడిపోలేదు. నక్షత్రాలు ఆకాశంలో ఇంకా స్పష్టంగా కనిపిస్తున్నాయి. చల్లగాలి వీస్తూ వాతావరణం ఆహ్లాదకరంగా ఉంది.

మాధవరావు కొండమీద తను పడుకున్న చోటు నుంచి చూస్తుంటే క్రింద లోయ, అడవి, అంతా మనోహర దృశ్యంలా కనిపిస్తోంది. లోయలో గిరిజన గూడెంలో ఉన్న నాలుగు గుడిసెలూ ఏదో తైలవర్ణ చిత్రంలో గుడిసెల్లా కనిపిస్తున్నాయి. వాటిలో ఒకదాని లోంచి సన్నగా, తీగలా తెల్లటి పొగ లేస్తోంది.

తన్మయత్వంతో ఆ సుందర దృశ్యం తిలకిస్తూ, "చంద్రం! లేచావా, నిద్రపోతున్నావా," అని అడిగాడు మాధవరావు.

కొంచెం దూరంలో కంబళీ ముసుగుపెట్టి పడు కున్న చంద్రం అటూ, ఇటూ కదిలాడుకానీ జవాబు చెప్పలేదు.

"చంద్రం- ఇలాంటి సుందర దృశ్యం చూసినప్పు డల్లా నాకేవనిపిస్తుందో చెప్పనా- ఇంత అందమైన లోకంలో ఇంత దు:ఖం ఎందుకుండాలని- పిచ్చి ఆలోచన కదూ! కానీ ఏనాటికైనా దోపిడీ, మోసం, దగా లేని కాలం వస్తుందంటావా? ఏనాటికైనా మనిషి మల్లెలా, స్వచ్ఛమైన మనసుతో జీవించడం నేర్చుకుంటా డంటావా..."

మాధవరావులో భావావేశం పొంగింది. అతను గొంతు విప్పి శ్రీశ్రీ గేయం అందుకున్నాడు.

*నిజంగానే నిఖిలలోకం*
*నిండుహర్షం వహిస్తుందా?*
*మానవాళికి నిజంగానే*
*మంచికాలం రహిస్తుందా?*
*నిజంగానే, నిజంగానే*
*నిఖిలలోకం హసిస్తుందా?*
*దారుణ ద్వేషాగ్ని పెంచే*
*దానవత్వం నశిస్తుందా..?*

మాధవరావు తన ప్రపంచంలో తనుండి చంద్రం మెల్లిగా లేవడం, అతని తుపాకీతో పాటు తన తుపాకీ కూడా తీసుకుని పొదల్లో నీడలా కలిసిపోవడం గమనించలేదు.

బరువైన బూటు క్రింద ఎండుపుల్ల విరిగిన శబ్దం విన్నా అతను మొదట పట్టించుకోలేదు. ఒక్కక్షణం తర్వాత అది అడుగుల శబ్దంగా గ్రహించి, అతను వెనక్కు తిరగబోతుండగా ఎవరో అతని కుడి చెయ్యి మెలితిప్పి బూటు కాలితో బలంగా కాళ్ల మీద తన్నారు. అతను క్రింద వెల్లకిలా పడిపోయాడు.

మరుక్షణం అనేక జతల బూట్లు అతని గుండెల మీదా, డొక్కల్లోనూ, మొహం మీదా తన్నడం మొదలు పెట్టాయి. లాఠీలదెబ్బల వర్షం కురిసింది. ఓ బూటు కాలు అతని తొడల మధ్య బలంతా తాకింది. అతనికి స్పృహ తప్పింది.

అతనికి తిరిగి స్పృహ వచ్చేటప్పటికి బాగా వెలుగు వచ్చింది. తను రెండు చేతులూ వెనక్కి విరిచి చెట్టుకి కట్టబడినట్లు గ్రహించాడు.

చంద్రం... చంద్రం గుర్తుకొచ్చి ఆత్రుతగా చూశాడు మాధవరావు- చంద్రం ఎక్కడా కనిపించలేదు. మెల్లిగా మాధవరావుకు అంతా అర్థమైంది.

చంద్రం మీద చాలాకాలంగా మాధవరావుకి అనుమానంగా ఉంది. చంద్రానికి తమ ఉద్యమ లక్ష్యాల పట్ల ఏ మాత్రం సానుభూతి లేదని, అతను దొంగలా దోపిడీలు చేస్తున్నాడని మాధవరావు గమనించాడు. చంద్రం పోలీసు ఏజెంటేమోనన్న అనుమానం వ్యక్త పరిచాడు. ఉద్యమం విస్తరించే పేరుతో అవాంఛనీయమైన వ్యక్తులందర్నీ చేరదీయవద్దని బాబయ్యని చాలాసార్లు హెచ్చరించాడు. కానీ బాబయ్య లక్ష్యపెట్టలేదు. దాని ఫలితం ఇది...

క్రింద లోయలోంచి ఏడుపులూ, అరుపులూ వినిపిస్తోంటే అతను అతి ప్రయత్నం మీద తల తిప్పి చూశాడు. క్రింద గిరిజన గూడెం తగలబడిపోతోంది. ఆడవాళ్లు, మగవాళ్లు, పిల్లలూ అందరూ బయటికి వచ్చి గొల్లుగొల్లున ఏడుస్తూ పోలీసుల కాళ్లమీద పడి బ్రతిమాలుతున్న దృశ్యం కనిపించింది.

ఇవి తన ఆఖరు క్షణాలు అన్నది అతనికి అర్థమైంది. అతనికి భయం కలగలేదు.

'జీవితం నన్ను ముక్కుకి తాడేసి ఈడ్చుకు పోలేదు. నా జీవితాన్ని నేను కోరుకున్న మార్గంలో చివరి వరకూ నడిపించాను,' అనుకున్నాడు అతను సగర్వంగా.

అంతలో అతనికి తండ్రి గుర్తుకొచ్చాడు.

ఏ క్లబ్బులోనో పేకాడుతుండగా తండ్రికి తన మరణవార్త తెలుస్తుంది- 'నాకు తెలుసు- ఈ వెధవ చివరికి ఇలా ఛస్తాడని,' అంటాడు తండ్రి. అలా అంటూ పేకముక్కలు పడేసి, సీసా అందుకుని తాగుతూ కూర్చుంటాడు.

సవితితల్లి ఓ క్షణం శోకాలు పెడుతుంది. మరు క్షణం ఆస్తిలో వాటా అడగడానికి సవతికొడుకు లేనందుకూ, అంతా తన పిల్లలకే మిగులుతున్నందుకు మనసులో సంతోషిస్తుంది.

ఛ... ఛ... మనిషికి మనిషికి మధ్య స్వార్థం తప్ప స్వచ్ఛమైన సంబంధం ఏవీలేదు. ఇలాంటి జీవితం జీవితం కాదు. ఇలాంటి బ్రతుకుకోసం అర్రులు చాచడం దేనికి? -మాధవరావు ఆలోచనలు అలా పరుగుతీస్తుండగా

''...కొడకా నీయమ్మ... ఎక్కడుందిరా నీ విప్లవం...'' అంటూ మాధవరావు జుట్టు పట్టుకుని గుంజి తలపైకెత్తిన పోలీసు ఆఫీసరు అతని కళ్లలోకి చూసి ఆగిపోయాడు ఆశ్చర్యంతో.

చావు ఎలాగూ తప్పదన్నప్పుడు చివరి క్షణాల్లో వచ్చే మొండితనమూ కాదు; తెచ్చిపెట్టుకున్న గాంభీర్యమూ కాదు- బ్రతుకంటే అసహ్యం, చావంటే నిర్లక్ష్యం- మాధవరావు మనసులోని భావాలు కళ్లలో ప్రతిఫలించి అతనికి కనిపించి అప్రయత్నంగా అతని జుట్టు వదిలేసి ఓ అడుగు వెనక్కు వేశాడు తెల్లబోయి.

పదిగజాల దూరంలో తన గుండెల కేసి గురి పెట్టబడిన నాలుగు తుపాకుల కేసి మాధవరావు నిర్లక్ష్యంగా చూశాడు.

ఆఖరి క్షణంలో అతనికి తల్లి గుర్తుకు వచ్చింది. ఆమె ఒడిలో తను నిశ్చింతగా పడుకుని ఆడుకుంటున్న దృశ్యం అతని కళ్ల ముందు మెదిలింది. తల్లి తనను ముద్దులాడటం గుర్తుకొచ్చి అతని ఒళ్లు పులకరించింది. తల్లి కౌగిలింతకూ, స్పర్శకూ చివరి క్షణంలో అతను తహతహలాడేడు.

''ఫైర్,'' అనే కేక వినిపించి వెనువెంటనే ఒక ఉరుము ఉరిమినట్లయింది. మాధవరావు పొట్టలోంచి, గుండెలోంచి, భుజంలోంచి నాలుగు గుళ్లు దూసుకు పోయాయి.

''అమ్మా!'' అనడానికి అతను నోరు తెరిచాడు. తూట్లు పడ్డ గుండెలోంచీ, ఊపిరితిత్తుల్లోంచీ, గొంతులోకి పొంగుకొచ్చిన రక్తం అతను నోరు తెరవగానే నోట్లోంచి వెల్లువలా ఉరికింది. అతని శరీరమంతా రక్తంతో తడిసిపోయింది. అతని మెడ ముందుకు వాలి పోయింది. ఎక్కడో అగాధంలో పడిపోతున్నట్లు ఇంకా చనిపోని మెదడుకు కొన్ని క్షణాల పాటు అనిపించింది. చెట్టుకు కట్టివేయబడ్డ అతని చేతులు రెండు మూడు క్షణాలు గింజుకున్నాయి. అతని చేతివేళ్లు మాత్రం పడిపోకుండా పట్టుకోసం తడుముకుంటున్నట్లు మరి కొంచెంసేపు గాలిలో కదిలి మెల్లిమెల్లిగా ఆగిపోయాయి.

జీవితాంతం తల్లి స్పర్శకు పరితపించిన అతనికి చివరి క్షణాల్లో నేలతల్లి ఒడి కూడా దూరమైంది.

అతను అలా నిలబడి ఉండగానే ప్రాణం పోయింది.

## 5

ఈ నాలుగు సంవత్సరాల్లోనూ విశ్వం చాలా మారాడు. అతని జుట్టు చెంపల దగ్గరా, పైనా కొద్దిగా నెరిసింది. కొద్దిగా బట్టతల కూడా వచ్చింది. కళ్లకి జోడు వచ్చింది. బొజ్జ పెరిగింది. ఇదంతా అతనికి ఓ హుందాతనాన్ని తీసుకొచ్చింది.

అతని వ్యాపారాలు మూడు పూవులూ, ఆరు కాయలుగా విస్తరించి విపరీతంగా లాభాలు వచ్చాయి. పరుగుపందెంలో ఆలస్యంగా బయలుదేరినవాడు అందర్నీ మించి ముందుకు వెళ్లడానికి శ్రమించినట్టు అతను జీవితంలో ముందుకు పోవడానికి చాలా శ్రమించాడు. ఆకాశంలో ఎంతో ఎత్తున ఎగిరే గ్రద్ద ఎక్కడో నేలమీది తినుబండారం పసిగట్టగలిగినట్లు అతనికి అధ్యయనంతో ఏ వ్యాపారంలో ఎక్కడ ఎంత లాభం వస్తుందో ముందుచూపుతో గ్రహించగల 'సిక్స్త్ సెన్సు' అలవడింది.

ఆస్తి రావడంతో అతని దృక్పథం కూడా బాగా మారింది.

అతనికి ఇదివరకు ఎక్కడ చూసినా దారిద్ర్యం, దౌర్జన్యం, దుర్మార్గం, మోసం కనిపించేవి. అక్రమాల్ని చూస్తే అతని గుండె భగ్గుమనేది. అందువలన అతను ఎప్పుడూ చిటపటలాడుతూ చికాగ్గా ఉండేవాడు. అతనికి లోకం ఇదివరకులా ఎర్రగా కాకుండా పచ్చగా కనిపించడం మొదలుపెట్టాకా అతనికి దేశంలో తను అనుకున్నంత దారిద్ర్యం లేదు అనిపించసాగింది.

'రిక్షావాడు కూడా సినిమా రిలీజైన రోజే మొదటి ఆటకు, రిజర్వుడు క్లాసుకి వెడుతున్నాడు కానీ, జనం తగ్గేదాకా ఆగటం లేదు. దరిద్రం ఎక్కడుంది- విప్లవ రచయితల పాటల్లోనూ, కథల్లోనూ తప్ప,' అనే అభిప్రాయానికి- బాహాటంగా అన్నా అనకపోయినా అతను మెల్లిమెల్లిగా వచ్చాడు.

ఇదివరకులా మంచీ-చెడూ కాక లాభం-నష్టం అతని జీవితాన్ని నడిపించసాగాయి. అతను ఈ కోణం నుంచీ చూడటం మొదలు పెట్టిన తర్వాత, 'శవాల్ని పీక్కుతినే... కొడుకులు,' అని అతను అసహ్యించుకునే లంచగొండి ఉద్యోగులూ, రాజకీయ నాయకులు మామూలు మనుషులుగానే కనిపించసాగారు. లోకంలో ఎవరి బ్రతుకు వారు బ్రతుకుతున్నారు; వాళ్లని విమర్శించడానికి నేనెవర్ని అని అనుకోసాగాడు కొంతకాలం. మరి కొంతకాలం గడిచి, అతని వ్యాపార వ్యవహారాల్లో నిరంతరం వారితో సంపర్కం ఏర్పడ్డ తర్వాత వాళ్లంటే ఓ విధమైన అభిమానం ఏర్పడింది.

"ఏవిటి విశ్వంగారూ! ఈ చిన్న పనికి మీరు స్వయంగా రావాలా- ఎవరినైనా పంపిస్తే సరిపోయేది కదా! అంటూ వాళ్లు అతనంటే చాలా అభిమానం చూపించేవారు. అతని కాగితాలు అతనింటికే ప్యూన్లు తీసుకొచ్చి, 'అయ్య'గారి కిచ్చి, ఆయన ఇచ్చే పదో పరకో తీసుకుని సంతోషంగా వెళ్లిపోయేవారు. ఈ వ్యవహారాల్లో అంతర్వాహినిలా ప్రవహించేది లంచం అని, అది అవినీతి అని అతను భావించడం మానేశాక అతని మొహంలో ఓ విధమైన తృప్తి, ప్రశాంతత కనిపించసాగాయి.

అలా 'స్వయంకృషి'తో పైకి వచ్చిన తర్వాత, క్రింద అట్టడుగున జీవితాలను చీమల్లా బరువుగా ఈడుస్తున్న వాళ్లని చూస్తే అతనికి సానుభూతి బదులు చికాకు కలిగేది. వాళ్లంతా బద్ధకస్తులూ, ఒళ్లు వంచి పని చెయ్యనివారూ, జీవితాన్ని పద్ధతి ప్రకారం నడపటం రాని అసమర్థులూ అనే అభిప్రాయం అతనిలో రోజు రోజుకూ బలపడసాగింది. కష్టపడి పనిచేస్తే జీవితంలో ఎవరైనా పైకి రాగలరు అనే భావం అతనిలో నాటుకు పోయింది. అతను మసులుతున్న ప్రపంచంలో అలాంటి 'రేగ్స్ టు రిచెస్' ఉదాహరణలు ఎన్నో చూశాక ఆ భావం మరింత బలపడింది.

అతను అలా పైకి వచ్చి త్వరలోనే పట్టణ ప్రముఖుల్లో ఒకడయ్యాడు. టైగర్స్ క్లబ్ మెంబరై డిస్ట్రిక్ట్ సెక్రటరీ కూడా అయ్యాడు. అతని స్థానం, పరిచయాలు అతని వ్యాపార వ్యవహారాల్లో చాలా ఉపయోగించాయి.

అతను ఏ డీఎస్పీగారితోనో, డిప్యూటీ కలెక్టరుగారితోనో క్లబ్బులో టెన్నిస్ ఆడుతున్నప్పుడు ఎవరో హఠాత్తుగా అనేవారు, "...మన విశ్వంగారు ఒకప్పుడు పెద్ద నక్సలైటు," అని. డీఎస్పీగారు, "ఐసీ," అని, "నేనూ గ్రేహౌండ్సులో నక్సలైటు ఏరియాల్లో రెండేళ్లు పని చేశాను," అంటూ సంభాషణ ప్రారంభించేవారు. తను వ్యవసాయ కూలీ హరిజన కుటుంబానికి చెందినవాడినని, పేదరికం అంటే ఏవిటో తనకు తెలుసుననీ, గిరిజనులు చాలా పేదరికంలో ఉన్నారనీ, వాళ్లంటే తనకు చాలా సానుభూతి ఉందనీ, వాళ్ల పరిస్థితి బాగుపడాలని మనస్ఫూర్తిగా కోరుకుంటున్నాననీ ఆయన అనేవారు.

"...కాని చూడండి, విశ్వంగారూ! వాళ్లను మీ వాళ్లు రెచ్చగొట్టి, హింసాయుత చర్యలకు దిగితే ఏక్షన్ తీసుకోకుండా ఏం చెయ్యాలో చెప్పండి," అంటూ బాల్ విశ్వం కోర్టులో వేసేవారు నిస్సహాయంగా.

డీఎస్పీగారు, డిప్యూటీ కలెక్టరుగారు, ఇంకా అనేకమంది మేధావులూ- అంతా గిరిజనుల జీవితాలు బాగుపడాలని మనస్ఫూర్తిగా కోరుతున్నారు. కానీ వాళ్లు హింస మాత్రం వద్దంటున్నారు. అలాంటప్పుడు విశ్వానికి వాళ్లు చెప్పేది సబబుగానే ఉంది అనిపించేది.

ఈ నాలుగేళ్లలోనూ విశ్వం పులుల కుటుంబంలోకి రెండు 'కబ్స్' కూడా చేరాయి. పెద్ద కుర్రాడిని ఊటీలో రెసిడెన్షియల్ స్కూల్లో చేర్పించడానికి ఏర్పాట్లు చేస్తున్నాడు. రెండో కుర్రాడికి ఇంకా రెండేళ్లు నిండలేదు.

విశ్వం చక్కటి తెల్లటి మేడ కట్టాడు. మేడ మీది విశాలమైన గదిని తన 'స్టడీ' చేసుకున్నాడు. ఆ స్టడీ కిటికీ తెరిస్తే పైరుగాలి చల్లగా, హాయిగా వీస్తుంది. ఆ కిటికీ దగ్గర కూర్చుని పచ్చని పొలాలు, తోటలు, దూరంగా కనిపించే రైలు రోడ్డు, అప్పుడప్పుడు దానిమీద పోయే రైలు బళ్లూ చూస్తూ ఎంతసేపైనా గడిపేయొచ్చు.

అతని స్టడీలో మార్క్సు, ఏంగెల్సు, లెనిన్, మావోలకి బదులు 'స్టాక్ మార్కెట్‌లో లక్షలు సంపాదించడం ఎలా?' లాంటి పుస్తకాలూ, ఆర్థిక విషయాలను వివరించే పత్రికలు కనిపిస్తాయి.

అతను ఆరోజు ఉదయం లేచి కాఫీ త్రాగుతూ ఎకనమిక్ టైమ్సు తిరగేస్తూ, 'హుర్రా' అని ఓ పొలికేక వేసి గబగబా ఫోను దగ్గరకి పరుగెట్టి శాస్త్రికి ఫోను చేస్తుండగా అతని కేక విన్న భార్య ఆయాసపడుతూ మెట్లెక్కి పరుగెట్టుకొచ్చింది- ఏం కొంపలు మునిగాయోనని.

''శాస్త్రి - ఎంటాప్ 1:1 బోనస్ ఇచ్చింది- ఈ రోజు ఎకనమిక్ టైమ్సు చూశావా?'' అన్నాడు విశ్వం ఫోనులో, సంతోషంతో ఉక్కిరిబిక్కిరవుతూ.

ఈ ఏడాది ఎంటాప్ కంపెనీ బోనసు ఇస్తుందని ఎవరూ అనుకోలేదు. అసలు దాని పెర్‌ఫార్మెన్సు అంత బాగుంటుందని ఎవరూ ఊహించలేదు. ఆరు నెలల క్రితం మేనేజ్‌మెంటు మారింది. కొత్త మేనేజ్‌మెంటు చురుకైంది. ఈ రెండూ దృష్టిలో ఉంచుకుని, అతను మార్కెట్ ధోరణికి ఎదురీది అంతా ఎంటాప్ షేర్లు అమ్మేస్తుంటే షేరు ఇరవై రెండు రూపాయలకి కారుచౌకలో వెయ్యి షేర్లు ఆరు నెలల క్రితం కొన్నాడు.

వార్షిక ఫలితాలు వచ్చి, బోనస్ ప్రకటించాక తర్వాత ఎంటాప్ షేరు బాంబేలో ఇరవై పాయింట్లు పెరిగి వందయింది.

''ఫ్లోటింగ్ స్టాకు చాలా తక్కువ- కమ్ బోనస్ రెండొందలు దాటిపోతుంది- చూస్తూ ఉండు,'' అన్నాడు విశ్వం శాస్త్రితో.

''జాక్‌పాట్ కొట్టేవన్నమాట,'' అన్నాడు శాస్త్రి అభినందిస్తూ.

విశ్వం భార్యకు ఎంత లాభం వచ్చిందో వివరాలు తెలియలేదు కాని, మొగుడికి స్టాక్‌మార్కెట్లో బాగా లాభం వచ్చిందని మాత్రం అర్థమైంది.

''ఈసారి నేను రవ్వల నక్లెసు చేయించుకుంటాను,'' అంది ఆమె.

''వెధవ రవ్వల నక్లెసేవిటే - నాలుగు కిలోల బంగారంతో రవ్వల వడ్డాణం చేయిస్తానే పిచ్చిముండా,'' అని గున్న ఏనుగులా ఉన్న పెళ్లాన్ని ముద్దుగా తిట్టి, నడుం కొలుస్తున్నట్టు చుట్టూ చేతులు బిగించాడు విశ్వం.

''ఏమిటా వెధవ మాటలు,'' అని ఆవిడ చిరుకోపంతో విదిలించుకుని క్రిందకు వెళ్లిపోయింది.

విశ్వం బాంబే బ్రోకరుకి ట్రంక్‌కాల్ చేసి, తను అమ్మదలుచుకున్న, కొనదలచుకున్న షేర్ల వివరాలు వ్రాసి ఉంచిన డైరీ అలమైరాలోంచి తీశాడు. అతను డైరీ పేజీలు తిరగేస్తుండగా ఎర్ర అక్షరాలున్న కాగితం ముక్క ఒకటి డైరీలోంచి జారి క్రింద పడింది. విశ్వం క్రిందకు వంగి ఆ కాగితం ముక్క తీసి అటూఇటూ తిప్పి చూశాడు.

'శింగేరి గట్టు క్రింద నీ శిరసూ తీస్తిరయ్యో - నరుడో... కారిన నెత్తురంత... కడవల్ల ఏమిటన్న... కల్లని...' అని ఉంది ఆ కాగితం ముక్కమీద.

విశ్వం పరధ్యానంగా ఆ కాగితం ముక్కమీద ఉన్నది చదివాడు కానీ అతనికి ఏవీ బోధపడలేదు. ఆ పిచ్చికాగితం ముక్క డైరీలోకి ఎలా వచ్చిందో అతనికి అర్థంకాలేదు. బహుశా పేజీ గుర్తుకి పెట్టుకుని ఉంటాననుకుని అతను ఆ కాగితం ముక్క నలిపి ఉండచుట్టి కిటికీలోంచి విసిరేశాడు.

ఆ పాటా, అది పాడిన మాధవరావూ, అతని స్మృతిపథం నుంచి ఎప్పుడో తుడిచిపెట్టుకుపోయారు. లేకపోతే ఎంటాప్ బోనస్ న్యూస్‌పడ్డ పేజీలోనే, ఎనిమిదవ కాలంలో 'ఎన్‌కౌంటర్లో ఉగ్రవాది మృతి' అనే శీర్షిక క్రిందపడ్డ వార్త అతని కంటపడేదే. వారం రోజుల క్రితం ఆదిలాబాద్ జిల్లా అడవుల్లో పోలీసులకీ, నక్సలైట్లకీ జరిగిన సంఘర్షణలో గురవయ్య ఎలియాస్ చిట్టిబాబు ఎలియాస్ సైదులు ఎలియాస్ అప్పలకొండ, ఎలియాస్ బంగార్రాజు, ఎలియాస్ సి.మాధవరావు అనే కరుడుగట్టిన నక్సలైటు మరణించినట్లు అతనికి తెలిసేదే!

అతను అలా స్టాక్‌మార్కెట్ కొటేషన్సు చూస్తుండగా ట్రంక్‌కాల్ కనెక్షను వచ్చింది. విశ్వం డైరీ ప్రక్కన పెట్టుకుని మాట్లాడసాగాడు- ''ప్లీజ్ సెల్ ది ఫాలోయింగ్ షేర్స్ ఎట్ బెస్ట్ మార్కెట్ ప్రైస్ అండ్ బై...''

*ఆంధ్రప్రభ వారపత్రిక, 13-19, 20-26 అక్టోబరు 1993*